**వార్తల్లో వేగం ఉండాలి..**
**కానీ వాస్తవాలు మరువద్దు!**






వాస్తవాలు పలుకు

# DD9 వార్త

TGTEL/26/A2635

తెలుగు దినపత్రిక








హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 57 | 09-07-2026 గురువారం | పేజీలు: 08 | వెల: 3/-


## పవన్ వీరాభిమాని నిరంజన్ కన్నుమూత

- హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- స్వస్థలం హనుమకొండలో తీవ్ర విషాదం
- అరుదైన జన్యు సంబంధిత వ్యాధితో పోరాటం
- ఆరోగ్యం క్షీణించడంతో అనంత లోకాలకు
- హనుమాన్ నగర్‌లో మిన్నంటిన రోదనలు
- శోకసముద్రంలో మునిగిన కుటుంబం
- జూన్ 17న నిరంజన్ నివాసానికి వెళ్లిన పవన్
- నిరంజన్‌కు ప్రముఖుల కన్నీటి నివాళి




## జమ్ముకశ్మీర్‌లో భీకర ఎన్‌కౌంటర్

- లష్కరే తోయిబా ఉగ్రవాది ఖతం
- భారీగా ఆయుధాలు స్వాధీనం!
- కశ్మీర్ లోయలో కొనసాగుతున్న ఉగ్రవేట
- సైద్‌పొరాలో ఉగ్రవాదిని మట్టుబెట్టిన బలగాలు
- ఐదు రోజుల పాటు నిరంతరాయంగా కార్డన్ సెర్చ్
- దట్టమైన పండ్ల తోటలను చుట్టుముట్టిన సైన్యం
- ముమ్మరంగా సాగుతున్న గాలింపు



**జమ్ముకశ్మీర్, (డిడి9 వార్త):**

జమ్ముకశ్మీర్ సరిహద్దుల్లో ఉగ్రవాదుల ఏరివేత లక్ష్యంగా భద్రతా బలగాలు జరిపిన భారీ ఎన్‌కౌంటర్ విజయవంతమైంది. దక్షిణ కశ్మీర్ ప్రాంతంలో గత ఐదు రోజులుగా మోహరించి, దాడులకు వ్యూహాలు పన్నుతున్న పాకిస్థాన్ అనుకూల ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకి చెందిన ఒక కీలక ఉగ్రవాదిని సైన్యం కాల్చిచంపింది. సైద్‌పొరా పరిధిలో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో ముష్కరుడు మరణించినట్లు జమ్ముకశ్మీర్ మిగతా 2లో..

# తెలంగాణలో గోద్రేజ్‌కు భారీ ప్రాజెక్టు..

- ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో సమీకృత ఆయిల్ పామ్ ప్రాజెక్టు ఏర్పాటు
- రాష్ట్రంలో తొలి ప్రైవేటు సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్‌గా రూపుదిద్దుకోనున్న ప్రాజెక్టు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో గోద్రేజ్ ఆగ్రోవెట్ ప్రతినిధుల కీలక సమావేశం
- ఆయిల్ పామ్ సాగు విస్తరణపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన కంపెనీ
- ప్రాసెసింగ్ యూనిట్, నర్సరీ, పరిశోధనఅభివృద్ధి కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు
- ఇప్పటికే 113.5 ఎకరాల భూమిని కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- సీడ్ గార్డెన్ విస్తరణకు మరో 3540 ఎకరాల భూమి కోరిన గోద్రేజ్
- ప్రాజెక్టు ద్వారా 700 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కంపెనీ వెల్లడి
- ప్రాసెసింగ్ యూనిట్‌కు రహదారి విస్తరణకు ప్రభుత్వాన్ని కోరిన ప్రతినిధులు
- టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని అధికారులకు సీఎం ఆదేశం

**రూ.300 కోట్లతో తొలి ప్రైవేటు ఆయిల్ పామ్ కాంప్లెక్స్**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగం వేగంగా ఆధునీకరణ వైపు అడుగులు వేస్తోంది. సాంప్రదాయ పంటల సాగుతో పాటు వాణిజ్య, ఉద్యాన పంటల వైపు రైతాంగాన్ని మళ్లించేందుకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇందులో భాగంగానే, రాష్ట్రంలో ఆయిల్ పామ్ (నూనె తాటి) సాగు విస్తరణకు మరియు ఉపాధి కల్పనకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలకమైన మైలురాయిని అధిగమించింది. దేశంలోనే ప్రముఖ అగ్రిబిజినెస్ దిగ్గజం అయిన "గోద్రేజ్ ఆగ్రోవెట్" కంపెనీ తెలంగాణలో ఒక భారీ పెట్టుబడి ప్రాజెక్టుతో ముందుకు వచ్చింది. రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రైవేటు సమీకృత మిగతా 2లో..

## నాకు మంత్రి పదవి ఇవ్వండి..
# నీళ్లు తెచ్చి చూపిస్తా

- కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది
- మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం
- సీఎంకు అబద్ధాల్లో నోబెల్ ఇవ్వొచ్చని వ్యాఖ్య
- తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై ప్రజెంటేషన్
- చెరువులు నింపడంలో ప్రభుత్వం విఫలమైందన్న హరీశ్
- వరంగల్ జిల్లాలో 90 శాతం ఎండిపోయిన చెరువులు
- రైతాంగాన్ని దగా చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో నీటిపారుదల రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తన్నీరు హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్ నగరంలోని తెలంగాణ భవన్ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టు, రాష్ట్రంలో ప్రస్తుత జల వనరుల లభ్యతపై ఆయన ఒక సమగ్రమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, జలవనరుల నిర్వహణలో చూపిస్తున్న చేతకానితనాన్ని ఆధారాలతో సహా మీడియా ముందు ఎండగట్టారు. ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా తెలంగాణలోని నదులు, ప్రాజెక్టులలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోందని హరీశ్ రావు తెలిపారు. ఈ నీటిని వాడుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలను నింపుకునే సువర్ణావకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదిలేస్తూ, రాష్ట్ర రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని, జల సంరక్షణలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో సరైన వర్షాలు లేక ప్రస్తుత సీజన్‌లో దాదాపు 90 శాతానికి పైగా చెరువులు అడుగంటి, పూర్తిగా ఎండిపోయాయని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందక రైతులు అల్లాడుతుంటే, ప్రాజెక్టుల వద్ద ఉన్న మోటర్లను ఆన్ చేసి నీటిని ఎత్తిపోయకుండా ప్రభుత్వం దుర్మార్గంగా ప్రవర్తిస్తోందని మండిపడ్డారు. కళ్లముందే నదుల నుంచి నీరు వృథాగా సముద్రం పాలు అవుతున్నా, మిగతా 2లో..

## భూభారతి రికార్డుల్లో
# భారీ అవకతవకలు

- రామచందర్ రావు సంచలన ఆరోపణలు
- గత ప్రభుత్వ ధరణి పోర్టల్‌పైనా కీలక వ్యాఖ్యలు
- తక్షణమే సమగ్ర 'సిట్' దర్యాప్తునకు డిమాండ్
- ప్రజల దృష్టిని మళ్లించేందుకే కన్నెపల్లి డ్రామాలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు
- ఎన్డీఎస్ఏ నివేదికే బీజేపీ అధికారిక విధానమని వెల్లడి
- మేడిగడ్డకు మరమ్మతులు చేయాలని డిమాండ్



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణి భూ రికార్డుల నిర్వహణ పోర్టల్‌లో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయన్నది పచ్చి నిజమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి పోర్టల్ లోపభూయిష్టమైన విధానాల వల్ల, కొందరు అధికారుల అండదండల వల్ల వేలాది మంది పేద, మధ్యతరగతి రైతులు తమ సొంత భూములను కోల్పోయి రోడ్డున పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పోర్టల్ వెనుక జరిగిన ఇండస్ట్రీ స్థాయి అవినీతిని ఆధారాలతో సహా బయటపెట్టాల్సిన మిగతా 2లో..

## తెలంగాణ విఫలం కాలేదు..
# సఫలమై నిలిచింది

- ప్రపంచ బ్యాంకు నివేదికపై కేటీఆర్ ఆనందం
- తెలంగాణ ఎగువ మధ్య స్థాయిని దాటిన రాష్ట్రం అంటూ ప్రపంచ బ్యాంకు నివేదిక
- ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తం చేసిన కేటీఆర్
- కేసీఆర్ దార్శనికత వల్లే ఈ అద్భుతం సాధ్యమైందని వ్యాఖ్య
- తెలంగాణ ప్రజలు బికారులు కాదన్న కేటీఆర్
- విమర్శలు చేసే వారికి వరల్డ్ బ్యాంక్ నివేదికే సమాధానమని వ్యాఖ్య



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

'తెలంగాణ దివాలా తీసింది' అంటూ దిక్కుమాలిన ప్రచారాలు చేసేవాళ్లకు గట్టి కౌంటర్ పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'ప్రపంచ బ్యాంకు' ఇచ్చిన తాజా నివేదికలో... తెలంగాణ ఎగువ మధ్య స్థాయిని దాటిన రాష్ట్రం అంటూ పేర్కొనడంపై కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే ఈ ఘనత సాధించిన టాప్5 అగ్ర రాష్ట్రాల్లో తెలంగాణ నిలవడం మనకందరికీ గర్వకారణమంటూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ పెట్టారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పరోక్షంగా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. కేసీఆర్ దార్శనిక పాలన వల్లే ఈ అద్భుతం సాధ్యమైందని కేటీఆర్ స్పష్టం చేశారు. పదేళ్ల కిందట వరకు దరిద్రం తాండవించిన ప్రాంతం కాస్తా... నేడు ధనిక రాష్ట్రంగా మారిందని అన్నారు. తెలంగాణ ప్రజలు బికారులు కాదని, సిరిసంపదలతో తులతూగే తెలంగాణ తల్లి బిడ్డలని వ్యాఖ్యానించారు. తమ చెమటను, నైపుణ్యాన్ని, మేధస్సును ధారపోసి తెలంగాణను శిథిలాల నుంచి శిఖరాలకు చేర్చిన ప్రతి పౌరుడికీ ఈ సందర్భంగా సెల్యూట్ చేస్తున్నామని చెప్పారు. "తెలంగాణ వస్తే ఏం పెరిగింది అని అడిగేవారు చూడాలి. ఇక్కడ జాతి సంపద పెరిగింది, జనం ఆదాయం అద్భుతంగా వృద్ధి చెందింది" అని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అద్వితీయంగా ముందుకు దూసుకెళ్లిందని కేవలం జాతీయ నివేదికలే కాదు, ఇప్పుడు ఏకంగా మిగతా 2లో..

## సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు

- కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన భట్టి విక్రమార్క
- సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి లభించిన అవకాశం
- మరో 40 సంవత్సరాల పాటు సింగరేణి మైనింగ్ కార్యకలాపాలకు భరోసా
- వేలాది మంది నిరుద్యోగులకు దక్కనున్న కొత్త ఉద్యోగ అవకాశాలు
- భూపాలపల్లి ప్రాంత సామాజిక, ఆర్థిక అభివృద్ధికి లభించనున్న ఊతం
- రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలంగాణ ప్రభుత్వం హృదయపూర్వక ధన్యవాదాలు
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్రం
- సింగరేణి బలోపేతం కోసం మిగిలిన బొగ్గు బ్లాకులను కేటాయించాలని కోరిక
- తెలంగాణ పారిశ్రామిక రంగానికి పెద్ద శుభపరిణామంగా నిలిచిన నిర్ణయం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లుగా సాగించిన నిరంతర కృషికి పెద్ద విజయం దక్కింది. రాష్ట్ర పరిధిలోని ప్రతిష్టాత్మక సింగరేణి కాలరీస్ సంస్థకు తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కేటాయింపు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి ఎంతో శుభపరిణామమని తెలంగాణ ప్రభుత్వం హర్షం వ్యక్తం చేసింది. ప్రజా ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల వల్లే సింగరేణికి ఈ మైనింగ్ హక్కులు లభించాయని స్పష్టం చేసింది. తాజాగా కేటాయించిన తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ ద్వారా



సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి భారీ అవకాశం లభించనుంది. దీనివల్ల మరో 40 సంవత్సరాల పాటు సింగరేణి మైనింగ్ కార్యకలాపాలకు ఎటువంటి ఢోకా లేకుండా బలమైన భరోసా మిగతా 2లో..

# పవన్ వీరాభిమాని నిరంజన్ కన్నుమూత

- హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- స్వస్థలం హనుమకొండలో తీవ్ర విషాదం
- అరుదైన జన్యు సంబంధిత వ్యాధితో పోరాటం
- ఆరోగ్యం క్షీణించడంతో అనంత లోకాలకు
- హనుమాన్ నగర్‌లో మిన్నంటిన రోదనలు
- శోకసముద్రంలో మునిగిన కుటుంబం
- జూన్ 17న నిరంజన్ నివాసానికి వెళ్లిన పవన్
- నిరంజన్‌కు ప్రముఖుల కన్నీటి నివాళి

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌కు అత్యంత ఆత్మీయ వీరాభిమాని అయిన హనుమకొండకు చెందిన పొనుగంటి నిరంజన్ (17) ఇకలేరు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ ఆయన బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. నిరంజన్ మరణ వార్త విన్న వెంటనే జనసేన పార్టీ శ్రేణులు, పవన్ కళ్యాణ్ అభిమాన లోకం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఒక అద్భుతమైన పసిహృదయం ఇంత చిన్న వయసులోనే ఆగిపోవడం అందరినీ కలచివేస్తోంది. పొనుగంటి నిరంజన్ గత కొంతకాలంగా అత్యంత అరుదైన జన్యు సంబంధిత (జెనెటిక్) వ్యాధితో బాధపడుతున్నారు. ఈ వ్యాధి కారణంగా ఆయన శారీరకంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ మంచానికే పరిమితమయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను బ్రతికించుకునేందుకు ఉన్నత వైద్యం అందిస్తూ వస్తున్నారు. అయితే, గత కొన్ని రోజులుగా ఆయన ఆరోగ్యం మరింతగా క్షీణించింది. అంతర్గత అవయవాల పనితీరు మందగించడంతో వైద్యులు ఎంత ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కేవలం 17 సంవత్సరాల వయసులోనే ఆయన అనంత లోకాలకు వెళ్లిపోయారు. నిరంజన్ పార్థివ దేహాన్ని హైదరాబాద్ నుండి ఆయన సొంత ఊరైన హనుమకొండలోని హనుమాన్ నగర్‌కు తరలించారు. నిరంజన్ మరణవార్త తెలియగానే హనుమాన్ నగర్ కాలనీలో ఒకేసారి తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. కళ్లముందే తిరుగాడిన కుర్రాడు నిగర్విగా మారి శవమై రావడంతో స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. కొడుకును కోల్పోయిన తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన కార్యకర్తలు నిరంజన్ నివాసానికి పెద్ద ఎత్తున చేరుకుని నివాళులర్పిస్తున్నారు.

గత నెల జూన్ 17వ తేదీన జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హనుమకొండ పర్యటనలో భాగంగా నిరంజన్ నివాసానికి స్వయంగా వెళ్లిన సంగతి ఈ సందర్భంగా అందరూ గుర్తుచేసుకుంటున్నారు. తనకోసం ప్రాణమిచ్చే అభిమాని మంచంపై వ్యాధితో పోరాడుతున్నాడని తెలిసి, పవన్ కళ్యాణ్ ప్రోటోకాల్స్ పక్కనబెట్టి నిరంజన్ ఇంటికి వెళ్లారు. కదలలేని స్థితిలో మంచంపై ఉన్న నిరంజన్ పక్కనే కూర్చుని, ఆయన తలపై నిమురుతూ, ఆత్మీయంగా హత్తుకుని కొండంత మానసిక ధైర్యాన్ని ఇచ్చారు.

ఆ పరామర్శ సమయంలో నిరంజన్ ఇల్లు ఎంతో సందడిగా మారింది. నిరంజన్ గతంలో పూర్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడు పవన్ కళ్యాణ్ నటించిన సినిమాల్లోని సూపర్ హిట్ పాటలకు అద్భుతంగా డాన్స్ చేసిన వీడియోలను కుటుంబ సభ్యులు పవన్ కళ్యాణ్‌కు చూపించారు. మంచంపై నుంచే నిరంజన్ ఆ వీడియోలను పవన్‌కు వివరిస్తుంటే, పవర్ స్టార్ ఎంతో మురిసిపోయి చూశారు. తనను అందరూ ప్రేమగా 'చోటా గబ్బర్ సింగ్' అని పిలుస్తారని నిరంజన్ చెప్పినప్పుడు పవన్ కళ్యాణ్ ముఖంలో ఎనలేని సంతోషం కనిపించింది. ఆత్మీయ సంభాషణల మధ్య పవన్ కళ్యాణ్ తన వీరాభిమాని నిరంజన్‌కు ఒక అద్భుతమైన తీపి మాట ఇచ్చారు. "నువ్వు త్వరగా కోలుకోవాలి.. మనమిద్దరం కలిసి కూర్చుని నా రాబోయే 'ఓజీ' సినిమా చూద్దాం. ఒకవేళ నేను 'ఓజీ 2' సినిమా గనుక తీస్తే, ఆ చిత్రంలో నువ్వే నా ప్రత్యేక అతిథివి (స్పెషల్ గెస్ట్)" అంటూ ప్రేమతో ప్రామిస్ చేశారు. పవన్ కళ్యాణ్ స్వయంగా ఈ మాట అనడంతో నిరంజన్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తన అభిమాన హీరో పక్కన నటించే అవకాశం వస్తుందని ఆయన ఎంతో ఆశగా ఎదురుచూశారు. ఆ రోజు నిరంజన్ పర్యటన ముగించుకుని వెళ్లే సమయంలో పవన్ కళ్యాణ్ తనతో పాటు ప్రత్యేకంగా తెచ్చిన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర తీర్థ ప్రసాదాలను నిరంజన్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు స్వయంగా అందించారు. స్వామివారి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని చెప్పారు. దాంతో పాటు నిరంజన్‌కు నచ్చే కొన్ని ప్రత్యేక బహుమతులను కూడా ప్యాక్ చేసి ఇచ్చారు. నిరంజన్ కుటుంబానికి తానున్నాననే నమ్మకాన్ని కల్పించి, ఆ ఇంట్లో ఎప్పటికీ మరిచిపోలేని తీపి జ్ఞాపకాలను పవన్ మిగిల్చారు. అయితే, పవన్ కళ్యాణ్ వచ్చి వెళ్లిన ఆ తీపి జ్ఞాపకాలు జరిగి కనీసం నెల రోజులు కూడా గడవకముందే నిరంజన్ ఈ లోకాన్ని విడిచి శాశ్వతంగా వెళ్లిపోవడం ఎవరికీ నమ్మశక్యంగా లేదు. పవన్ కళ్యాణ్ ఇచ్చిన 'ఓజీ' సినిమా మాటలు, 'ఓజీ 2' లో గెస్ట్ రోల్ ఆఫర్ జ్ఞాపకాలు అలాగే మిగిలిపోయాయి. 'చోటా గబ్బర్ సింగ్' లేడనే చేదు నిజం అటు కుటుంబ సభ్యులను, ఇటు జనసైనికులను తీవ్రంగా వేధిస్తోంది. నిరంజన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా పవన్ కళ్యాణ్ అభిమానులు కన్నీటి నివాళులర్పిస్తున్నారు.

# భూభారతి రికార్డుల్లో భారీ అవకతవకలు

**మొదటిపేజీ తరువాయి**

సమయం ఆసన్నమైందన్నారు. కేవలం ధరణి పోర్టల్ మాత్రమే కాకుండా, గతంలో చేపట్టిన 'భూభారతి' సర్వే కార్యక్రమాల్లోనూ విపరీతమైన అవకతవకలు, తప్పుడు రికార్డుల నమోదు జరిగాయని రామచందర్ రావు ఆరోపించారు. భూముల సరిహద్దులను తారుమారు చేస్తూ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కేవలం సాధారణ విచారణలతో సరిపెట్టకుండా, ధరణి మరియు భూభారతి ప్రాజెక్టుల ద్వారా జరిగిన భూ కుంభకోణాలపై తక్షణమే ప్రత్యేక విచారణ బృందం చేత సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీలు అంతర్గతంగా చేతులు కలిపాయని రామచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ధరణి, భూభారతి అక్రమాలు ఎక్కడ బయటపడతాయోననే భయంతోనే ఈ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని విమర్శించారు. ఇందులో భాగంగానే ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు కావాలనే కన్నెపల్లి పంప్ హౌస్ అంశాన్ని త్వరగా తెరపైకి తెచ్చి సరికొత్త నాటకాలకు తెరలేపాయని ఆయన దుయ్యబట్టారు. తెలంగాణ జలవనరుల ప్రాజెక్టులపై జరుగుతున్న రాజకీయ రచ్చపై రామచందర్ రావు తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్నది కాళేశ్వరం లేదా కూలేశ్వరం కాదని, కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఉమ్మడిగా ఆడుతున్న 'డ్రామేశ్వరం' అని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పక్కనబెట్టేందుకు, కేవలం తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ఈ 'డైవర్షన్ పాలిటిక్స్' (ప్రజల దృష్టి మళ్లించే రాజకీయాలు) చేస్తున్నారని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన అధికారిక నివేదికే ఈ విషయంలో బీజేపీ స్పష్టమైన విధానమని రామచందర్ రావు ప్రకటించారు. ప్రాజెక్టుల రక్షణ విషయంలో కేంద్ర సంస్థలు ఇచ్చిన సాంకేతిక నివేదికలను గౌరవించాలన్నారు. ఇప్పటికైనా రెండు పార్టీలు తమ రాజకీయ స్వార్థాన్ని, బురదజల్లే కార్యక్రమాలను పక్కనబెట్టి, కూలిపోయే స్థితికి చేరిన మేడిగడ్డ బ్యారేజీతో పాటు ఇతర పంప్ హౌస్‌లకు అవసరమైన అత్యవసర మరమ్మతు పనులను (రిపేర్లు) యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. రాజకీయ స్వార్థం కోసం అన్నదాతలైన రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని హితవు పలికారు.

తెలంగాణ పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న ఒక చారిత్రాత్మక నిర్ణయాన్ని రామచందర్ రావు ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. ఎలాంటి బహిరంగ వేలం (ఆక్షన్) పాట లేకుండానే, ప్రత్యేక కోటా కింద తాటిచర్ల2 బొగ్గు గనిని కేంద్ర ప్రభుత్వం నేరుగా సింగరేణి కాలరీస్ సంస్థకు కేటాయించిందని చెప్పారు. చరిత్రలో ఎప్పుడు చూసినా సింగరేణి సంస్థను ఆర్థిక సంక్షోభాల నుంచి కాపాడింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలేనని, కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ పార్టీలు ఆ సంస్థ ప్రయోజనాల కోసం చేసిందేమీ లేదని స్పష్టం చేశారు.

# తెలంగాణలో గోద్రేజ్‌కు భారీ ప్రాజెక్టు..

**మొదటిపేజీ తరువాయి**

ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ఈ సంస్థ శ్రీకారం చుట్టింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన పురోగతి, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై చర్చించేందుకు గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఉన్నత స్థాయి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు.

**ముఖ్యమంత్రితో ఉన్నత స్థాయి సమావేశం**

హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆవరణలోని బోధి పెవిలియన్‌లో ఈ కీలక సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో గోద్రేజ్ గ్రూప్ కార్పొరేట్ అఫైర్స్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి, గోద్రేజ్ ఆగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సౌగత నియోగి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చర్చలు జరిపింది. తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును మరింత విస్తృత స్థాయికి తీసుకువెళ్లేందుకు, స్థానిక రైతులకు మెరుగైన ప్రయోజనాలను చేకూర్చేందుకు తాము రూపొందించిన సమగ్ర నివేదికను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి అందజేశారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణం, ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు తమను ఎంతగానో ఆకర్షించాయని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**రూ.300 కోట్ల భారీ పెట్టుబడి - ఖమ్మం జిల్లా వేదికగా ప్రాజెక్టు**

గోద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థ తెలంగాణలో సుమారు రూ.300 కోట్ల భారీ పెట్టుబడితో ఈ సమీకృత ఆయిల్ పామ్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం ఖమ్మం జిల్లాను వేదికగా ఎంచుకున్నారు. దేశంలోనే ఆయిల్ పామ్ సాగుకు అత్యంత అనుకూలమైన వాతావరణం, నీటి వసతి మరియు ప్రగతిశీల రైతులు ఉన్న జిల్లాల్లో ఖమ్మం అగ్రస్థానంలో ఉంది. ఈ జిల్లాలో ఏర్పాటు కాబోయే ప్రాజెక్టు కేవలం ఒక నూనె మిల్లు లాగా కాకుండా, 'సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్'గా వ్యవహరించబడుతుంది. అంటే, ఆయిల్ పామ్ విత్తనం నాటే స్థాయి నుంచి పండ్లు కోసి నూనె తీసే వరకు అవసరమైన అన్ని రకాల సేవలు మరియు సాంకేతికతలు ఒకే చోట లభిస్తాయి. రాష్ట్రంలో ప్రైవేటు రంగంలో నెలకొల్పబోతున్న మొట్టమొదటి సమీకృత కాంప్లెక్స్ ఇదే కావడం గమనార్హం.

**స్థానికులకు భారీగా ఉపాధి అవకాశాలు**

ఈ రూ.300 కోట్ల భారీ ప్రాజెక్టు స్థాపన ద్వారా ఖమ్మం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ కాంప్లెక్స్ ద్వారా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా 700 మందికి పైగా నిరుద్యోగ యువతకు, సాంకేతిక నిపుణులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని గోద్రేజ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి స్పష్టం చేశారు. పరిశ్రమ స్థాపన దశలోనే కాకుండా, ఇది పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత స్థానిక రవాణా రంగం, కూలీలు, చిన్న తరహా వ్యాపారాలకు కూడా పరోక్షంగా ఎంతో లబ్ధి చేకూరుతుంది.

**రైతులకు సాంకేతిక అండ - ప్రాజెక్టు విశేషాలు**

ఖమ్మం జిల్లాలో ఏర్పాటు కాబోతున్న ఈ కాంప్లెక్స్‌లో అనేక ఆధునిక విభాగాలు ఒకే చోట కొలువుదీరనున్నాయి. ఇందులో ముఖ్యమైనవి:

1.ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్:* రైతుల నుంచి సేకరించిన ఆయిల్ పామ్ గెలలను త్వరితగతిన ప్రాసెస్ చేసి, నాణ్యమైన ముడి పామాయిల్ తయారు చేసేందుకు అత్యాధునిక మిల్లింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారు.

2.అంతర్జాతీయ స్థాయి నర్సరీ:* రైతులకు అధిక దిగుబడిని ఇచ్చే మరియు తెగుళ్లను తట్టుకునే నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కలను సరఫరా చేయడానికి ఒక పెద్ద నర్సరీని ఇక్కడ అభివృద్ధి చేస్తారు.

3. పరిశోధన అభివృద్ధి కేంద్రం:* తెలంగాణ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించే పద్ధతులపై శాస్త్రవేత్తలు ఇక్కడ పరిశోధనలు నిర్వహిస్తారు.

4. సీడ్ గార్డెన్ (బీజ క్షేత్రం):* నాణ్యమైన విత్తనాల ఉత్పత్తికి అవసరమైన అంతర్గత వనరులను ఇక్కడే సమకూర్చుకుంటారు.

ఈ మౌలిక వసతుల వల్ల తెలంగాణ రైతులకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం, అత్యుత్తమ మేనేజ్‌మెంట్ పద్ధతులు అందుబాటులోకి వస్తాయి. దీనివల్ల ఎకరాకు వచ్చే ఆయిల్ పామ్ దిగుబడి పెరిగి, రైతుల ఆదాయం రెట్టింపు అయ్యేందుకు అవకాశం ఉంది.

**భూమి కేటాయింపులు మరియు అదనపు విజ్ఞప్తులు**

ఈ బృహత్తర ప్రాజెక్టు ప్రాధాన్యతను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే వేగంగా అడుగులు వేసింది. ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఈ ప్రాజెక్టు ఏర్పాటు కోసం గోద్రేజ్ సంస్థకు కేటాయించింది. ఈ భూమిలో ఇప్పటికే ప్రాథమిక పనులు ప్రారంభమయ్యాయి. అయితే, తాము ప్రతిపాదించిన 'సీడ్ గార్డెన్'ను మరింత విస్తరించి, అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు గోద్రేజ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సీడ్ గార్డెన్ విస్తరణ కోసం అదనంగా మరో 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని వారు రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

దీంతో పాటు, ప్రాసెసింగ్ యూనిట్ నిర్మితమవుతున్న ప్రాంతానికి భారీ యంత్రాలు, రవాణా వాహనాలు నిరంతరం రాకపోకలు సాగించాల్సి ఉంటుందని, కాబట్టి ప్రస్తుతం ఉన్న రహదారి సామర్థ్యం సరిపోదని వివరించారు. రైతుల నుంచి గెలలను సకాలంలో ఫ్యాక్టరీకి చేర్చడానికి మరియు రవాణా ఇబ్బందులు లేకుండా చూసేందుకు వీలుగా ప్రాసెసింగ్ యూనిట్‌కు వెళ్లే లింక్ రోడ్డును విస్తరించాలని వారు కోరారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల స్పందన - తక్షణ ఆదేశాలు**

గోద్రేజ్ అగ్రోవెట్ ప్రతినిధులు చేసిన ప్రతిపాదనలు, అభ్యర్థనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి, ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. కంపెనీ కోరిన విధంగా మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యంగా, తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో గోద్రేజ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు వెళ్లే రహదారి విస్తరణ పనులను అత్యంత ప్రాధాన్యత ప్రాతిపదికన చేపట్టాలని సంబంధిత శాఖాధికారులను సీఎం ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని, పెట్టుబడిదారులకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని స్పష్టం చేశారు. అదనపు భూమి కేటాయింపులపై కూడా నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# జమ్ముకశ్మీర్‌లో భీకర ఎన్‌కౌంటర్

**మొదటిపేజీ తరువాయి**

పోలీస్ యంత్రాంగం అధికారికంగా వెల్లడించింది. హతుడైన ఉగ్రవాది నుంచి పెద్ద ఎత్తున దేశీయ, విదేశీ ఆయుధాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ భారీ ఆపరేషన్‌కు ఐదు రోజుల క్రితమే పునాది పడింది. షోపియాన్ జిల్లాలోని సైద్‌పొరా ప్రాంతంలో ఉన్న దట్టమైన పండ్ల తోటల గుండా ఇద్దరు అనుమానాస్పద ఆయుధధారులు నడుచుకుంటూ వెళ్తున్న విజువల్స్ అత్యున్నత నిఘా కెమెరాల్లో (డ్రోన్లు) రికార్డయ్యాయి. వారు లష్కరే కమాండర్ జాకీర్ గనాయ్, అతని అనుచరుడు లతీఫ్ భట్‌గా గుర్తించిన అధికారులు జులై 3న మెగా ఆపరేషన్ ప్రారంభించారు. షోపియాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, ఆర్మీకి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్, సీఆర్‌పీఎఫ్ దళాలు సంయుక్తంగా రంగంలోకి దిగి ఆ ప్రాంతాన్ని శత్రువులకు దారి లేకుండా చుట్టుముట్టాయి. రాత్రి వేళల్లో కూడా వెతుకులాట ఆగకుండా భారీ ఫ్లడ్‌లైట్లను అమర్చారు. గత ఐదు రోజులుగా కంటిమీద కునుకు లేకుండా సాగుతున్న ఈ గాలింపు చర్యల్లో భాగంగా బుధవారం ఉదయం ఒక కీలక మలుపు చోటుచేసుకుంది. తోటల్లో నక్కిన ఉగ్రవాదులు తమను సైన్యం చుట్టుముట్టిందని గ్రహించి, ఒక్కసారిగా స్వయంచాలక తుపాకులతో భద్రతా బలగాలపైకి కాల్పుల వర్షం కురిపించారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులు ప్రారంభించారు. ఇరుపక్షాల మధ్య గంటల తరబడి భీకరమైన రీతిలో తుపాకుల మోత మోగింది. సైన్యం వ్యూహాత్మకంగా ముందుకు కదులుతూ ఉగ్రవాదుల స్థావరాన్ని దెబ్బతీసింది.

కాల్పుల తీవ్రత తగ్గిన తర్వాత, భద్రతా దళాలు సదరు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని అంగుళం అంగుళం తనిఖీ చేశాయి. ఈ క్రమంలో అక్కడ బుల్లెట్ల గాయాలతో పడి ఉన్న ఒక ఉగ్రవాది శవాన్ని అధికారులు గుర్తించారు. అతని వివరాలను సేకరించగా, అతడు లష్కరే తోయిబా సంస్థలో సుదీర్ఘకాలంగా కమాండర్‌గా వ్యవహరిస్తున్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది జాకిర్ అహ్మద్ గనీ అలియాస్ జాకీర్ గనాయ్‌గా స్థానిక పోలీసులు స్పష్టం చేశారు. అతని మృతదేహంతో పాటు ప్రతీకార దాడులకు సిద్ధం చేసుకున్న భారీ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. జాకిర్ గనీ హతమైనప్పటికీ, అతనితో పాటు నిఘా కెమెరాల్లో కనిపించిన మరో ప్రమాదకర ఉగ్రవాది లతీఫ్ భట్ ఇంకా అదే ప్రాంతంలో దాక్కుని ఉన్నట్లు సైనిక వర్గాలు భావిస్తున్నాయి. అతను ఆ పండ్ల తోటల సరిహద్దు దాటి జనావాసాల్లోకి లేదా పక్కనే ఉన్న అడవుల్లోకి పారిపోకుండా ఉండేందుకు వీలుగా సైన్యానికి చెందిన ప్రత్యేక 'విక్టర్ ఫోర్స్' దళాలను అదనంగా రంగంలోకి దించారు. ఆధునిక థర్మల్ ఇమేజింగ్ పరికరాలు, నిఘా డ్రోన్ల సహాయంతో కొండ ప్రాంతాలు, గుహలను జల్లెడ పడుతున్నారు. భద్రతా బలగాలు సాధించిన ఈ వ్యూహాత్మక విజయంపై జమ్ముకశ్మీర్ పోలీస్ విభాగం తమ అధికారిక సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా సంతోషం వ్యక్తం చేస్తూనే, ఉగ్రవాదులకు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. "మీరు ఎంత దూరమైనా పారిపోవచ్చు.. కానీ భారత సైన్యం నుంచి ఎప్పటికీ తప్పించుకోలేరు" అంటూ ట్వీట్ చేసింది. షోపియాన్‌లో ఎస్ఓజీ, రాష్ట్రీయ రైఫిల్స్, సీఆర్‌పీఎఫ్ సంయుక్త సమన్వయంతోనే ఈ కమాండర్ ఖతమయ్యాడని, ఉగ్రవాదం అంతమయ్యే వరకు పోరు సాగుతుందని స్పష్టం చేసింది.

# సింగరేణికి తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ కేటాయింపు



**మొదటిపేజీ తరువాయి**

లభించినట్లయింది. ఈ భారీ మైనింగ్ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది యువతకు కొత్తగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అంతేకాకుండా, ఈ బ్లాక్ పరిధిలోకి వచ్చే భూపాలపల్లి ప్రాంతం సామాజికంగా, ఆర్థికంగా మరింత వేగంగా అభివృద్ధి చెందడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది.

తెలంగాణ ప్రజా ప్రభుత్వ విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి, తాడిచర్ల2 బ్లాక్‌ను సింగరేణికి కేటాయించినందుకు గాను గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రభుత్వం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే, ఈ ప్రక్రియలో చొరవ చూపిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. భవిష్యత్తులో సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడం కోసం, రాష్ట్రంలో మిగిలి ఉన్న ఇతర బొగ్గు బ్లాకులను కూడా సంస్థకే కేటాయించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## నాకు మంత్రి పదవి ఇవ్వండి..
# నీళ్లు తెచ్చి చూపిస్తా



**మొదటిపేజీ తరువాయి**

రైతుల పొలాలకు మళ్లించకపోవడం కంటే దారుణం మరొకటి లేదన్నారు.

తెలంగాణ ప్రాజెక్టుల నుంచి నీటిని యథేచ్ఛగా దిగువకు వదిలేయడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహం దాగి ఉందంటూ హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి గురుదక్షిణ చెల్లించుకోవడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ వాటాను, హక్కులను కాలరాస్తూ నీటిని ఆంధ్రాకు వదులుతున్నారని ఘాటుగా సెటైర్లు వేశారు. స్వరాష్ట్ర ప్రయోజనాలను రేవంత్ రెడ్డి పక్క రాష్ట్రానికి తాకట్టు పెడుతున్నారని ధ్వజమెత్తారు.

నదులలో, ప్రాజెక్టులలో పుష్కలంగా నీటి లభ్యత ఉండి కూడా, మోటర్ల సహాయంతో వాటిని లిఫ్ట్ చేయకపోవడం ముమ్మాటికీ క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందికే వస్తుందని హరీశ్ రావు స్పష్టం చేశారు. రైతుల జీవితాలతో ఆడుకుంటున్నందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఉరితీసినా తప్పు లేదని తీవ్ర పదజాలంతో ధ్వజమెత్తారు. నీళ్ల మంత్రిగా ఉత్తమ్, సీఎంగా రేవంత్ ఇద్దరూ తమ బాధ్యతలను నిర్వహించడంలో వంద శాతం ఫెయిల్ అయ్యారని విమర్శించారు. దేవాదుల ఎత్తిపోతల పథకానికి సంబంధించిన సాంకేతిక వివరాలను హరీశ్ రావు ఈ సందర్భంగా బయటపెట్టారు. సాధారణంగా దేవాదుల మోటర్లు నడవాలంటే నదిలో 71 మీటర్ల మేర నీటి మట్టం ఉంటే సరిపోతుందని, కానీ ప్రస్తుతం అక్కడ 75 మీటర్ల మేర నీరు నిండి ఉందని తెలిపారు. నీళ్లు సమృద్ధిగా ఉన్నా కావాలనే దేవాదులలోని సగానికి పైగా మోటర్లను ఆన్ చేయకుండా బంద్ పెట్టారని మండిపడ్డారు. కేసీఆర్ కష్టపడి ఇల్లు కట్టి, పొయ్యి పెట్టి ఇస్తే.. ఈ చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం వండుకుని తినలేకపోతోందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు వ్యక్తిగతంగా విమర్శల దాడి పెంచారు. నిత్యం అబద్ధాలు చెప్పే విషయంలో రేవంత్ రెడ్డికి ప్రపంచంలోనే అత్యున్నతమైన 'నోబెల్ ప్రైజ్' ఇవ్వొచ్చంటూ సెటైర్లు వేశారు. నిన్న ముఖ్యమంత్రి ప్రెస్ మీట్ పెట్టి చెప్పిన ప్రతి ఒక్క అబద్ధానికి, ఆయన మాట్లాడిన ప్రతి ఒక్క అక్షరానికి తాను ఆధారాలతో సహా సమాధానం చెబుతానని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో మొదటి నుంచి ఈ ప్రభుత్వం ప్రతికూల ఆలోచనలతో ఉంటూ, మేడిగడ్డ నెపంతో కుంటిసాకులు వెతుకుతోందని మండిపడ్డారు. తమ్మిడిహట్టి ప్రాజెక్ట్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు ఒక బహిరంగ సవాల్ విసిరారు. తమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్ట్ కట్టడానికి మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో ఒప్పుకున్నట్లుగా ఎలాంటి డాక్యుమెంట్లు అయినా రేవంత్ రెడ్డి వద్ద ఉంటే, వాటిని వెంటనే మీడియా ముందు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆ డాక్యుమెంట్లు నిజమని రుజువు చేస్తే, తాను తక్షణమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. ఒకవేళ ఆ ఆధారాలు చూపించలేకపోతే, అబద్ధాలు చెప్పినందుకు గాను ప్రజల ముందుకు వచ్చి రేవంత్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు గట్టిగా సవాల్ విసిరారు.

## తెలంగాణ విఫలం కాలేదు..
# సఫలమై నిలిచింది



**మొదటిపేజీ తరువాయి**

అంతర్జాతీయ సంస్థలే స్టాంప్ వేసి చెబుతున్నాయన్నారు. రాజకీయ స్వార్థం కోసం ప్రతిదానికీ 'దివాలా.. దివాలా' అంటూ మైకుల ముందు అరిచే వాళ్ల నోళ్లు మూయించడానికి ప్రపంచ బ్యాంకు ఇచ్చిన ఈ తాజా నివేదికే ఒక పవర్‌ఫుల్ సమాధానమని పేర్కొన్నారు.

# ములుగు మున్సిపల్ నూతన పాలకవర్గం ఏర్పడి 5 నెలలు కావస్తున్న పరిపాలన మాత్రం గాడి లో పడటం లేదు


- **గండ్రకోట వాణి కుమార్ 9వ వార్డు కౌన్సిలర్**

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు మునిసిపాలిటీ లో కౌన్సిలర్లు ఉచ్చుకత తో ప్రజలకు సేవ చేయడానికి ఆసక్తి చూపుతున్న కూడా నిధులలేమి మరియు అధికారుల అలసత్వం కారణంగా పనులు నత్తనడకన కొనసాగుతూ ఉండడం బాధాకరం.

వర్షాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ దోమల లార్వా మందు పిచికారి చేయడం, మురికి కాలువల శుభ్రత లో భాగంగా బ్లీచింగ్ పౌడర్ లాంటివి, రోడ్ల వెంబడి చిన్న చిన్న ముళ్ళ పొదలు, పిచ్చి మొక్కల తొలగింపు లాంటి సమస్యలకు చెక్ పెడదామంటే కనీసం వార్డుకు ఇద్దరు చొప్పున సఫాయి కార్మికులను కమిషనర్ నియమించడం లేదు. ఒంటెద్దు పోకడలతో వీరి వ్యవహారం కొనసాగుతూ ఉన్నది.

132 మంది మున్సిపల్ సిబ్బంది ఉన్న కూడా ప్రతి వార్డ్ కి ఇద్దరు చొప్పున సపాయి కార్మికుల ను నియమించే గతిలేకపోయింది. వీరి పని ఇలా ఉందంటే ఇక... వార్డులో ఉన్న ప్రజలు గెలిచిన కౌన్సిలర్లను నిలదీసే పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా తొమ్మిదవ వార్డులో 46 కరెంటు స్తంభాలు కొన్ని వంగి మరియు కొన్ని విరిగి ఉండడం జరిగింది వాటి స్థానంలో కొత్తవి 46 ఏర్పరచాలని కరెంటు డి ఈ గారికి మరియు మున్సిపల్ నెలవారి సమావేశంలో మా నుండి దరఖాస్తు పత్రం ఇచ్చినా కూడా ఇప్పటివరకు గతి లేదు. మున్సిపల్ ఆ అమౌంట్ కట్టాలి అని కరెంటు డీ.ఈ చెప్పడం, మున్సిపల్ నిధులు లేవు అని కమిషనర్ చెప్పడం ఈ విధంగా ప్రజలు ఇబ్బంది పడడం ప్రస్తుతం జరుగుతున్న తీరు బాధాకరం. ఇంతవరకు చెత్త తీసుకుపోయే నూతన వాహనాలు 10 ఏర్పాటు చేస్తున్నామని కమిషనర్ గారు గత రెండు మాసముల మున్సిపల్ సమావేశాలలో ఎజెండా పాయింట్ గా ప్రవేశపెట్టి చెప్పడం జరిగింది కానీ ఇంతవరకు వాటిని చూస్తామో లేదో తెలియదు కానీ కనీసం వాడల్లో చెత్త వేయడానికి ప్రతి వాడ కార్నర్ లో చెత్తకుండీల ను అయినా ఏర్పాటు చేయవలసిందిగా కోరుచున్నాము. గత గ్రామపంచాయతీ లో చాలా రోడ్లు వేశారు ప్రస్తుతం 9వ వార్డులో 4:30 కి.మీ విస్తీర్ణంలో రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయవలసి ఉన్నది. అది వదిలిపెట్టి గొల్లవాడ వైపు ఉన్న రోడ్లను పాడుచేసి , గతంలో ఉన్న మిషన్ భగీరథ పైప్ లైన్ తీయకుండానే, గతంలో వేసిన కరెంటు స్తంభాలను తీయకుండానే 6 ఇంచులు ఉండే రోడ్డును కాస్త ఫీటన్నర ఎత్తుతో నూతన రోడ్లను నాణ్యత ప్రమాణాలు లేకుండాతూతూ మంత్రంగా రోడ్లు వేసి అభివృద్ధి పేరు మీద కోట్ల నిధులను దుర్వినియోగం చేయడం ఎవరి కమిషన్ల కోసమో కమిషనర్ గారు చెప్పాలి. అభివృద్ధిని గాలికి వదిలేసి కమిషన్ల కాసులకు కక్కుర్తి పడడం నకు ఇకనైనా చెక్ పెట్టాలని కమిషనర్ గారిని డిమాండ్ చేస్తున్నాం. ములుగు మున్సిపాలిటీలో ఏ వార్డులో అభివృద్ధి జరిగినా అది ములుగు కమిషనర్ కి ఆ గుర్తింపు వస్తుందనేది మర్చిపోవద్దని కమిషనర్ గారు గుర్తుంచుకోవాలని సూచిస్తున్నాం. ఈ ఆదరాబాదర గా .... మంచిగా ఉన్న రోడ్లను ఖరాబు చేయడం కంటే ములుగు మునిసిపాలిటీలో అసలే రోడ్లు లేని వార్డులు చాలా ఉన్నాయి. అందులో ఎక్కువ మొత్తం 9వ వార్డు లో ఉంది. అందులో నూతన రోడ్లు వేయొచ్చు కదా ! ముఖ్యంగా 9వ వార్డు మెయిన్ రోడ్డు డ్రైనేజీ ని గతంలో కృష్ణ కాలనీ ప్రజల ధర్నాల కారణంగా అటు వెళ్లే డ్రైనేజీని కాస్త, జాతీయ రహదారికి కలుపుతూ ఆనాటి కలెక్టర్ నిర్ణయం తీసుకొని జాతీయ రహదారికి కలిపారు. కానీ డ్రైనేజీలో మాత్రం త్రిభుజాకృతిలో డ్రైనేజీ అడుగుభాగం నీ కృష్ణా కాలనీ వైప వర్షపు నీరు మరియు మురుగు నీరు వెళ్లే విధంగా చాలా వంపుతో ఆ నిర్మాణం ఏర్పాటు చేశారు. దాని కారణంగా నీరు ఎటు వెళ్ళని పరిస్థితిలో ఉంది. ఈ విషయంపై కమిషనర్ కి మరియు కలెక్టర్ గారికి ఎన్నోసార్లు వినతి పత్రాలు సమర్పించిన స్పందించే నాథుడు లేడు. ఇప్పటికైనా అధికారులు మెయిన్ రోడ్డు డ్రైనేజీకి ఈ నీరు పోయే విధంగా డ్రైనేజీ అడుగుభాగాన్ని చదును చేసే ఆలోచన చేయవలసిందిగా కోరుచున్నాము. దయచేసి అయ్యా కమిషనర్ గత కమిషనర్ రమేష్ ఒక నెల గడువులోపు కోటి రూపాయల ఇంటి పన్నును ఇంటింటికి తిరిగి అతనే స్వయంగా ఇంటింటికి తిరిగి వసూలు చేయడం హర్షించదగ్గ విషయం అని అందరు గుర్తించారు. మీరు మరియు చైర్మన్ సంవత్సరానికి ₹7,20,000 మీరు వార్డు పరిశీలనకు తిరగడానికి మీ వాహనాల ఖర్చుకు చూపిస్తున్నారు. కావున కనీసం ఆ ఖర్చు మందం అయినా మీరు ములుగు అభివృద్ధిని మరియు ఇంటి పన్నుల



వసూలు నీ గత కమిషనర్ మాదిరిగా మానిటరింగ్ చేయాలని సూచిస్తున్నాం.

మనం పన్నులు వసూలు చేసినట్లు వార్డులో ప్రతి ఇంటికి నల్ల ,విద్యుత్తు, డ్రైనేజీ మరియు చెత్త తీసుకపోవడం, రోడ్డు నిర్మాణం పనులు వగైరా కల్పించే బాధ్యత మన మీద నే ఉంది కావున ఈ విషయాలను ప్రజలకు కల్పిస్తూ పన్నుల వసూలలో మనం బాధ్యత వహిస్తే బాగుంటుంది. అంతేకానీ కేవలం పన్నులు వసూలు చేసి సౌకర్యాల లేమీ తో ప్రజలను ఇబ్బంది పెడితే అది నూతన మున్సిపాలిటీకి మంచిది కాదు. పై విషయాలన్నిటిమీద మున్సిపాలిటీ కమిషనర్ గారు బాధ్యత వహించి ములుగు అభివృద్ధిలో మంత్రి సీతక్క సహాయ సహకారాలు తీసుకొని ములుగును వేగవంతంగా అభివృద్ధి పథంలోకి తీసుకుపోవాలని కోరుచున్నాము.

# కూనవరం గ్రామపంచాయతీ లో బందెలదొడ్డి నిర్మాణానికి సింగరేణి సంస్థ ముందుకు రావడం హర్షణీయం.

- **ఏరియా టిబిజికేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.**

**మణుగూరు.జూలై 8 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమంతో పాటు కూనవరం గ్రామ పంచాయతీ పరిధిలో పశువుల సంరక్షణ, కార్మిక వాడల్లో పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని సామాజిక బాధ్యత లో భాగంగా బందెల దొడ్డి నిర్మాణానికి మణుగూరు సింగరేణి యాజమాన్యం చర్యలు ప్రారంభించడం హర్షణీయమని మణుగూరు ఏరియా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నాడు పాత కూనవరం ప్రాంతం లోని కూల్చివేసిన సింగరేణి క్వార్టర్ల సమీపంలో బందెల దొడ్డి నిర్మాణం కోసం స్థల పరిశీలన చేపట్టడం ఎంతో సంతోషకరమైన పరిణామమని ఆయన పేర్కొన్నారు.

కూనవరం గ్రామ పంచాయతీ పరిధిలో బందెలదొడ్డి లేకపోవడంతో కొంతమంది పశువుల యజమానులు తమ పశువులను ఇష్టానుసారంగా రహదారులపై, సింగరేణి కార్మిక వాడల్లో వదిలివేస్తున్నారని, దీనివల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు గాయాలపాలవుతున్నారని తెలిపారు. అంతేకాకుండా పశువుల దాడుల కారణంగా పలువురు గాయపడటంతో పాటు ఒక కార్మికుడి తల్లి మృతి చెందిన విషాద ఘటన కూడా చోటు చేసుకుందని గుర్తు చేశారు.ఈ సమస్య పరిష్కారం కోసం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి యాజమాన్యం, కూనవరం గ్రామ పంచాయతీ పాలకవర్గం, పోలీసు శాఖ అధికారులకు పలు సందర్భాల్లో వినతిపత్రాలు సమర్పించామని ఆయన తెలిపారు. ఇప్పుడు సింగరేణి సంస్థ బందెలదొడ్డి నిర్మాణానికి చేయూత అందించడం కార్మిక ,ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకున్న మంచి నిర్ణయమని అభినందించారు. బందెలదొడ్డి నిర్మాణం పూర్తయితే రహదారులపై స్వేచ్ఛగా సంచరించే పశువుల సంఖ్య తగ్గి రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని, సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ప్రాణాలకు మెరుగైన రక్షణ కలుగుతుందని, కార్మిక వాడల్లో పరిశుభ్రత కూడా గణనీయంగా మెరుగుపడుతుందని నాగెల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అందువల్ల బందెలదొడ్డి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన మణుగూరు సింగరేణి యాజమాన్యాన్ని మరియు సంబంధిత అధికారులను కోరారు.





## ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ను మర్యాదపూర్వకంగా కలిసిన విద్యుత్ శాఖ అధికారులు..

- **విద్యుత్ షాక్ వల్ల మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.20 లక్షల ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ.**

**మణుగూరు.జూలై 8(డి డి 9వార్త)**

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) కమిషన్ ఛైర్మన్‌గా నియమితులైన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ను మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (DE), అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ADE), సబ్ ఇంజినీర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఇటీవల విద్యుత్ షాక్ కారణంగా మృతి చెందిన జనంపేట కొత్తూరు కాలనీకి చెందిన బిజ్జా రాజిత కుటుంబానికి, కరకగూడెం మండలం భట్టుపల్లి కి చెందిన బిలపాటి నరేందర్ కుటుంబానికి, మణుగూరు మండలం కాళిమాత ఏరియాకు చెందిన తిగుళ్ల ఉపేందర్ కుటుంబానికి, శివలింగాపురానికి చెందిన బేతం రత్నం కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం లో భద్రాచలం ఆపరేషన్ డివిజన్ డీఈ కె. జీవన్ కుమార్, మణుగూరు ఆపరేషన్ ఏడీఈ డి. ఉమా మహేశ్వరరావు, సబ్ ఇంజినీర్లు వై. శివకుమార్, ఎం. లారెన్స్, ఎస్ఎల్ఐ జి. సర్వేశ్వరరావు, ఎల్ఐ ఎం. మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఐటీసీ-పీఎస్‌పీడీ సహకారంతో రూ.1.50 కోట్ల ఆధునిక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం..

- **భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.జూలై 8(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు గ్రామపంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెం గ్రామంలో ప్రజల అవసరాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఐటీసీపీఎస్‌పీడీ (ITCPSPD) వారి సౌజన్యం, సహాయసహకారాలతో సుమారు రూ.1 కోటి 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఆధునిక కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం నాడు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వంతో పాటు పారిశ్రామిక సంస్థలు కూడా సామాజిక బాధ్యతతో గ్రామీణాభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతుల కల్పనలో కమ్యూనిటీ హాల్ కీలక పాత్ర పోషిస్తుందని, గ్రామ ప్రజలు సామాజిక, సాంస్కృతిక, విద్యా మరియు ఇతర సామూహిక కార్యక్రమాలను సౌకర్యవంతంగా నిర్వహించుకునేందుకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారం అందించిన ఐటీసీపీఎస్‌పీడీ యాజమాన్యానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీమతి బానోత్ సరోజ, ఐటీసీపీఎస్‌పీడీ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పామాయిల్ రైతులకు శుభవార్త..

- **ఏడూళ్ళ బయ్యారం లో స్టాక్ యార్డ్ కోసం ఎకరా భూమి కేటాయింపు.**

**మణుగూరు.జూలై 8(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం లోని ఏడూళ్ళ బయ్యారం గ్రామం వద్ద పామాయిల్ స్టాక్ యార్డ్ కోసం రైతు పక్షపాతి, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు చొరవతో ప్రభుత్వం తో చర్చించి పామాయిల్ స్టాక్ యార్డు కొరకు చర్యలు తీసుకున్నారని,పామాయిల్ రైతులకు త్వరలోనే ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం నాడు ఈ. బయ్యారం లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని ఇందుకోసం ఒక ఎకరా భూమిని కేటాయించడానికి చర్యలు చేపట్టినట్టు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, సీనియర్ నాయకులు,సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# 12వ వార్డు అభివృద్ధిపై కౌన్సిలర్ ఫోకస్

- **మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్న రాజు నాయక్**
- **బోర్ల మరమ్మతు, డ్రైనేజీ వ్యవస్థ పై దృష్టి**
- **వార్డు పరిధిలో సీసీ రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు**
- **బండారుపల్లి చెరువులోకి ములుగు మురికి నీరు రాకుండా చర్యలు**
- **ఇటుక బట్టీల కారణంగా ప్రజల అనారోగ్యం**
- **ప్రజల సేవకే నా జీవితం అంకితం**
- **12వ వార్డు కౌన్సిలర్ పోరిక రాజు నాయక్**



**ములుగు, జూలై 5, డీ డీ 9 వార్త :**

ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు అభివృద్ధిపై కౌన్సిలర్ పోరిక రాజు నాయక్ కృషి చేస్తున్నారు. ఫేస్ టు ఫేస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయనను డీ డీ 9 వార్త ప్రత్యేకంగా కలిసి పలకరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీటినందించేందుకు 8 బోర్లను మరమ్మతు చేయించానని, అలాగే మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు కలుషితం కాకుండా ఎక్కడైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వెంటనే స్పందించి రిపేరు చేయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ములుగు మున్సిపాలిటీ అభివృద్ధికి గాను ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ నుండి 49 కోట్ల రూపాయలు, ములుగు మున్సిపాలిటీ నుండి 17 కోట్ల రూపాయలు కేటాయించగా టెండర్లు సైతం పూర్తయినట్లు ఆయన పేర్కొన్నారు. ములుగు నుండి జీవంతరావు పల్లెకు రూపాయలు 30 లక్షలతో పైపులైను, ములుగు నుండి బండారు పల్లి కి రూపాయలు 20 లక్షలతో పైపులైను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలో వెలుగులు విరజిమ్మెందుకు 50 డూమ్ లైట్లు ఏర్పాటు చేశామని, వీలైనంత త్వరలో మరో 50 లైట్లు ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. వార్డు పరిధిలోని ప్రజలను ఇబ్బందులకు గురి చేసే కోతుల బెడద లేకుండా వాటి నివారణకు కృషి చేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. ములుగు పట్టణం నుండి వచ్చే మురికి నీరు బండారు పల్లి చెరువులోకి వచ్చి నీరు కలుషితమవుతుందని ఈ విషయాన్ని మంత్రి సీతక్క ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. వెంగళరావు అలియాస్ వెంగయ్య అనే ఇటుక బట్టి వ్యాపారి గ్రామ పరిసరాల్లో ఉన్న మూడు ఇటుక బట్టీల ద్వారా వచ్చే పొగ, దుమ్ము,ధులి కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఈ ప్రాంతం నుండి వీటిని తరలించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. ఇటుక బట్టీల కారణంగా మోడల్ స్కూలు విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని, కాబట్టి వ్యాపారులకి ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని పోరిక రాజు నాయక్ తెలిపారు.

# వార్డు సభ్యునికి గ్రామస్తుల చేయూత

**డీ డీ 9 వార్త, ములుగు. :**

చక్రవర్తి పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ని మూడవ వార్డు సభ్యుడు అజ్మీరా రవి సతీమణి అనారోగ్య కారణాలతో కనీసం వైద్యం చేయించలేని స్థితిలో ఉండగా నిన్న సాయంత్రం మరణించడం జరిగినది... ఇట్టి కుటుంబము కడు పేదరికంలో జీవనం సాగిస్తున్నారు. ఇట్టి కుటుంబానికి ఆర్థిక చేయూతను అందించడం కోసం చక్రవర్తి పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామపంచాయతీ పాలకవర్గము అందరూ కలిసి 14000, అలాగే ఆనందపురం గ్రామస్తులు కలిసి 20000.. ఎస్సీ కాలనీ గ్రామస్తులు 3500. మొత్తం 37500 రూపాయలను గౌరవ సర్పంచ్ భూక్య రఘు గారి, మరియు పాలక వర్గం ఆధ్వర్యములో బాధిత కుటుంబానికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమములో చక్రవర్తి పల్లి గ్రామ ప్రజలు అందరు పాల్గొనడం జరిగినది.



# రామాలయంలో హుండీ దోపిడి

**కరకగూడెం, జూలై 8( డి డి 9 వార్త):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం అనంతారం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో హుండీ దోపిడీ జరిగింది. మంగళవారం రాత్రి హుండీని దొంగలు గుడి వెనుకకు ఎత్తుకెళ్లి తాళం పగలగొట్టి అందులోని నగదును దోచుకున్నారు.ఈ విషయాన్ని ఉదయం గుడి తెరిచిన తర్వాత గమనించిన ఆలయ పూజారి కమిటీ వారికి తెలియజేయడం జరిగింది. కమిటీ వారు కరకగూడెం పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇవ్వడం జరిగింది.వెంటనే పోలీసు వారు ఫోరెన్సిక్ విభాగం వారు గ్రామానికి వచ్చి గ్రామ సర్పంచ్ పాయం కృష్ణవేణి మరియు ఆలయ కమిటీ వారితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఫింగర్ ప్రింట్స్ నమూనాలను సేకరించారు. దొంగలను అతి త్వరలో పట్టుకొని తగు చర్యలు తీసుకుంటామని కరకగూడెం ఎస్ఐ తెలిపారు.




# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం...

- **నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం.**
- **దివంగత నేత YSR విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**మణుగూరు.జూలై 8(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని లబ్ధిదారులు ధరావత్ శిరీష, నందిగామ సత్యవతిలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వేగవంతంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.అనంతరం దివంగత మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ పేద ప్రజల సంక్షేమం కోసం చేసిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ), ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, వివిధ శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## మహానేత తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన డా.వైయస్ రాజశేఖర్ రెడ్డి

**ఘనంగా జన హృదయ విజేత , సంక్షేమ ప్రదాత అపరభగీరతుడు డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి 77 వ , జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాల వేసి కేక్ కట్ చేసి ఘన నివాళి అర్పించిన తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామి**

**తాడ్వాయి మండలం (డిడి9 వార్త)**

తాడ్వాయి మండల కేంద్రంలోనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామి ఆద్వర్యంలో డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించిన అనంతరం. , కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ స్వీట్స్ పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పాలనకు నాంది పలికి రైతు సంక్షేమం , ఆరోగ్య శ్రీ , 108 సేవలు , ఉచిత విద్యుత్ , జలయజ్ఞం , వంటి పథకాలతో ప్రజల మన్ననలు పొందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు ఈసందర్భంగా వారికి మరొకసారి శతకోటి వందనాలు అని తెలిపారు
ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్ర కోల తిరుపతి , మండల ఉపాధ్యక్షులు ఇప్ప నాగేశ్వర రావు , సహకార సంఘం మాజీ చైర్మన్ పాక సాంబయ్య , బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఎండి ముజఫర్, సింగల్ విండో డైరెక్టర్ యానాల సిద్ది రెడ్డి, సర్పంచులు తోలేం కృష్ణ, మంకిడి శ్రీలత ప్రశాంత్, కోర్ణబెల్లి సావిత్రి, యాప కళ మోహన్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముక్తి రామస్వామి, ఉపసర్పంచుల కట్కూరి భాస్కర్ రెడ్డి, రాపోలు సంజీవ రెడ్డి, తాడ్వాయి క్లస్టర్ అధ్యక్షులు సాదు చక్రపాణి, మండల నాయకులు పులి చిన్న నర్సయ్య, పులి రవి, పాలకుర్తి మధు, లంజపెల్లి నర్సయ్య, ఖలీల్, మజ్జు, జూనేద్, శనిగరపు చిరంజీవి, మొక్క దుర్గయ్య, దాయ వెంకన్న, సిద్దబోయిన శ్రీనివాస్, నూణావత్ శ్రీను, ఎనగంటి సంజయ్, మహిళా నాయకురాలు ముంద్రాతి రాజశ్రీ, యూత్ నాయకులు గజ్జల నరేందర్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గజ్జల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## మహానేత వైయస్సార్ కి ఘనంగా నివాళులర్పించిన ప్రజా ప్రతినిధులు.

**మణుగూరు.జూలై 8(డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,మణుగూరు మండలం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొని వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల సారథి, రైతు బాంధవుడు, సంక్షేమాన్ని పాలనను సమపాలనలో నడిపిన గొప్ప నేత అని అన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వంటి పథకాలతో పేద ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు.ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ పిసిసి అధ్యక్షులు, మరియు మాజీ ముఖ్యమంత్రి వర్యులు దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి జయంతి సందర్భంగా ఆ మహానీయుడి అడుగుజాడల్లో నడుస్తూ, వారు అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడి ముంగిటిలోకి తీసుకు వెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సమితి సింగారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవ రావు, గుట్ట మల్లారం పంచాయతీ సర్పంచ్ కారం పూజ, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు శ్రీమతి కోలపిన్ని మానస, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ గణేష్ రెడ్డి, మైనారిటీ అధ్యక్షులు ఎస్కే రహీం పాషా తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి గారి జన్మదిన వేడుకలు

**జనగామ జూలై 08( డిడి9) వార్త**

ఈరోజు స్టేషన్ ఘనపూర్ MLA గారి క్యాంప్ కార్యాలయంలో గౌరవ మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ MLA కడియం శ్రీహరి జన్మదినం సందర్భంగా జరిగిన వేడుకల్లో పాల్గొని సార్ కి శుభాకాంక్షలు తెలియజేసిన జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, AMC పాలకవర్గ సభ్యులు బోట్ల నర్సింగరావు,నీల మోహన్, MD బాష్మియా, నామాల శ్రీనివాస్,తోటకురి రమేష్ , బంధ కుమార్ , బానోత్ బన్సీ నాయక్,జనగామ ముఖ్య నాయకులు సాదం మధుసూదన్ , బనుక ప్రభాకర్,రఘు గౌడ్ మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## దశదినకర్మలకు 50 కిలోల బియ్యం అందించిన జిల్లా యూత్ కాంగ్రెస్

**మంగపేట జూలై 08డీడీ 9 వార్త**

ములుగు మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, రాష్ట్ర నాయకుడు కుంజ సూర్యన్న, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ సూచనలతో జిల్లా యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్ ఆధ్వర్యంలో మంగపేట మండలం నర్సింహ సాగర్ గ్రామంలో ఓ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన మచ్చా సత్యం భార్య లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ దశదినకర్మల నిర్వహణ కోసం 50 కిలోల బియ్యాన్ని సహాయంగా అందజేశారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాడిశ ఆదినారాయణ, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మురుకుట్ల నరేందర్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దల సాయి, గౌరవ అధ్యక్షుడు కస్పా ముకుందం, ఉపాధ్యక్షుడు మల్యాల నరేష్, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు పుల్లూరి తిరుపతి, ప్రధాన కార్యదర్శి పాయం సతీష్, ప్రచార కార్యదర్శి ముగల చంటి, మండల యూత్ సోషల్ మీడియా ఇన్‌చార్జి బంధు రాము, సీనియర్ యూత్ కాంగ్రెస్ నాయకుడు బూర్గుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఫిట్స్‌తో యువకుడి మృతి.. కుటుంబంలో విషాదం

**మంగపేట జూలై 08డీడీ 9 వార్త**

ములుగు జిల్లా బుచ్చంపేట గ్రామ పరిధిలోని జబ్బోనిగూడెం గ్రామానికి చెందిన జబ్బ వెంకటేష్ (27) ఫిట్స్ రావడంతో బుధవారం అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలో ఆయన పరిస్థితి విషమించి మృతి చెందాడు. వెంకటేష్ మృతితో జబ్బోనిగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. యువకుడి అకాల మరణం కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు సమాచారం



## సరదా విహారం_ _ _ విషాదాంతం

- **స్నేహితులతో సరదాగా వెళ్లిన యువకుడు నీట మునిగి మృతి**

**వాజేడు, జూలై 8 (డీడీ9 వార్త):**

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని దూలాపురం మాసాలోది జలపాతం వద్ద విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్నేహితులతో కలిసి విహారయాత్రకు వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు కాలుజారి జలపాతంలోని లోయలో పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. వివరాల్లోకి వెళితే, సిద్ధిపేట పట్టణానికి చెందిన వైభవ్ కుమార్ (18) తన స్నేహితులతో కలిసి విహారయాత్రకు బయలుదేరాడు. ముందుగా వరంగల్ ప్రాంతంలోని వేయి స్తంభాల దేవాలయం, భద్రకాళి ఆలయం, రామప్ప దేవాలయాన్ని సందర్శించిన అనంతరం ములుగు జిల్లా వాజేడు మండలంలోని బోగత జలపాతాన్ని వీక్షించారు. తిరుగు ప్రయాణంలో దూలాపురం గ్రామ సమీపంలోని మాసాలోది జలపాతాన్ని సందర్శిస్తున్న సమయంలో వైభవ్ కుమార్ ప్రమాదవశాత్తు కాలుజారి లోయలో పడిపోయాడు. వెంటనే అతని స్నేహితులు గాలింపు చర్యలు చేపట్టగా, సుమారు అరగంట తర్వాత అతడిని బయటకు తీశారు.
అనంతరం ద్విచక్ర వాహనంపై వాజేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంకటాపురం సీఐ ముత్యం రమేష్, వాజేడు ఎస్ఐ జక్కుల సతీష్ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. వైద్యులు అత్యవసర చికిత్సతో పాటు సీపీఆర్ నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్ ద్వారా ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ వైద్యులు పరీక్షించి వైభవ్ కుమార్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.





## స్థానిక ఆదివాసులపై జరుగుతున్న ఫారెస్ట్ దాడులు అక్రమ కేసులను నిలుపుదల చేయాలి

**మంగపేట జూలై 08డీడీ 9 వార్త**

ములుగు జిల్లా మంగపేట మండలంలోని పద్మార్ రెవెన్యూ గ్రామం గంపోనిగూడెం ఆదివాసి గిరిజన రైతులు ఎన్నో ఏళ్లగా సాగు చేస్తున్న పోడు భూములను అడ్డుకుంటున్న ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ మండల అధ్యక్షుడు పోలేబోయిన ఆదినారాయణ మాట్లాడుతూ గతంలో సర్వేనెంబర్ 107/1లో 60911, సర్వేనెంబర్ 108, లో 92813, సర్వేనెంబర్ 125/1లో 77030 ఎకరములు మొత్తం విస్తరణ 241803 ఎకరముల మూడు గంటల భూమిని గతంలో 01082017 నుండి 31082017వరకు రెవెన్యూ శాఖ అటవీ శాఖ అధికారులు జాయింట్ సర్వే చేసినారు ఇట్టి భూమి సర్వే చేసి నివేదిక ప్రకారం రెవెన్యూ భూమి యా లేదా అటవీ భూమియ నిర్ధారణ చేసి నిరుపేద ఆదివాసి గిరిజనులకు అసైన్మెంట్ పట్టాలు కానీ అటవీ హక్కుల చట్టం ప్రకారంగా హక్కు పత్రాలు ఇవ్వాలని అప్పటి ఉప కలెక్టర్ గిరిజన సంక్షేమ శాఖ ఐటిడి ఏటూరునాగారం RC NO.ఎ/17/2017తేది 22062017 రోజున ఆదేశాలు ఇచ్చినారు కానీ ప్రభుత్వాలు కానీ ప్రభుత్వ అధికారులు కాని ఏమాత్రం పట్టించుకోవడం లేదు స్థానిక ఆదివాసులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్తాం అంటూ హెచ్చరిస్తూ వివిధ రాష్ట్రాల నుండి వలస వచ్చి గొత్తి కొయలమని చెప్పుకుంటూ ఈ ప్రాంతంలో స్థానిక ఆదివాసులు తాత ముత్తాతల నుండి కాపాడుకున్నటువంటి అటవీ భూమి లో నివాసాలు ఏర్పాటు చేసుకుని 1000 వేయిల ఎకరాలు సాగు చేస్తున్నా పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు స్థానిక ఆదివాసులు పోడు సాగు చేస్తే అడ్డు కొవటం ఏంటి అంటూ ఆదివాసి ప్రజాసంఘాలు ఆవేదన వ్యక్తం చేశారు అదేవిధంగా రెవెన్యూ రికార్డు ప్రకారం గంపోనిగూడెం ఆదివాసి గిరిజనులు 1964 నుండి పూర్వం వాళ్ళ తాత ముత్తాతలు నివాసాలు ఉన్నట్టుగా నిర్ధారణ అయినప్పటికీ ప్రభుత్వాలు ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టి స్థానిక ఆదివాసులకు అక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతూ లేనియెడల కలెక్టర్ ఆఫీస్ ముట్టడి చేస్తామని తెలుపుతున్నాం ఈ కార్యక్రమంలో, ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు పోలేబోయిన ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు, మన్య సీమ నాయకులు, పునేం రాములు, తోలేం సుధాకర్, గొప్ప చంద్రకాంత్, కొమరం రవి, మన్య సీమ మహిళ నాయకురాలు ఇరుప అరుణ, తోలేం సౌమ్య, వాగబోయిన లావణ్య పూనెం నిర్మల, పుసం సావిత్రి. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై తహసీల్దార్‌తో భేటీ

**మంగపేట,జూలై08డీడీ 9 వార్త**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం నేపథ్యంలో, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ మంగపేట మండల మాజీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ మరియు ములుగు జిల్లా సీనియర్ నాయకులు కుడుముల తన అనుచర బృందంతో కలిసి మంగపేట తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.కొత్త ఓటర్ల నమోదు, పేర్ల చేర్పు, తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణల కోసం పాటించాల్సిన విధానం, దరఖాస్తుల స్వీకరణ మరియు పరిశీలన ప్రక్రియ వంటి అంశాలపై వారు తహసీల్దార్‌తో చర్చించారు.అనంతరం కుడుముల మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే జాబితాలో ఉన్న వారు తమ వివరాలను సరి చూసుకుని, ఏవైనా లోపాలు ఉంటే సవరణలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మంగపేట మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మాజీ మండల ఆర్గనైజేషన్ కార్యదర్శి చల్లగురుగుల తిరుపతి, మాజీ ఎస్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి కేక్కం జగదీష్, పార్టీ నాయకులు పంజాల సత్యం, జిల్లా నాయకులు కొమరం సిద్ధు, యువజన నాయకులు ముప్పారాపు సందీప్, సామాజిక మాధ్యమ ప్రతినిధులు బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



# మరపురాని మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా
# విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ

- **జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి**

**మంగపేట జూలై 08డీడీ 9 వార్త**

మరపురాని మహానేత, సంక్షేమ సారథి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా మంగపేట మండలం అకినేపల్లి మల్లారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వికాస్ అగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటుబుక్స్, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నాసిరెడ్డి సాంబశివరెడ్డి మాట్లాడుతూ, పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చి వేలాది మంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకునేలా చేసిన మనసున్న నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. అలాగే ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, 108, 104 సేవలు, రైతు రుణమాఫీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, విద్యుత్ బకాయిల మాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. భౌతికంగా వైఎస్సార్ మన మధ్య లేకపోయినా ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల మదిలో ఎప్పటికీ నిలిచివుంటాయని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కూడా వైఎస్సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క నాయకత్వంలో అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.



అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచి వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, వికాస్ అగ్రి ఫౌండేషన్ వైస్ చైర్మన్ పచ్చిపులుసు నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

**మంగపేట జూలై 08డీడీ 9 వార్త**

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా & శిశు సంక్షేమ, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రివర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశానుసారం, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు, మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు, దివంగత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు మాట్లాడుతూ, డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రజాసంక్షేమాన్ని పరమావధిగా భావించి పరిపాలన సాగించిన మహోన్నత ప్రజానాయకుడని కొనియాడారు. సమాజంలోని బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేసి, కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు తీసుకొచ్చిన దూరదృష్టి గల నాయకుడని పేర్కొన్నారు.

పేద మరియు మధ్యతరగతి విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు దూరం కాకూడదనే సంకల్పంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి లక్షలాది మంది యువతకు ఉన్నత విద్యా అవకాశాలను కల్పించారని గుర్తు చేశారు. అలాగే, ఆర్థిక స్థోమత లేని పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను ఉచితంగా అందించాలనే మహత్తర లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసి లక్షలాది కుటుంబాలకు ప్రాణదాతగా నిలిచారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితులు, అంటువ్యాధులు, విషజ్వరాల బారిన పడిన ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు 108 అంబులెన్స్ సేవలు మరియు ప్రజారోగ్య రక్షణకు 104 ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజల ప్రాణాలను కాపాడిన దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు.



అదేవిధంగా రైతాంగ సంక్షేమాన్ని ప్రభుత్వ విధానాలకు కేంద్రబిందువుగా నిలబెట్టి, రైతులకు రుణమాఫీ అమలు చేయడం, ఉచిత విద్యుత్ అందించడం, సాగునీటి ప్రాజెక్టులకు విశేష ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వ్యవసాయ రంగానికి పునరుజ్జీవం కల్పించిన రైతు బాంధవుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. నిరుపేదలకు సొంత ఇంటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో గృహ నిర్మాణ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేసి, ప్రతి పేద కుటుంబం గౌరవప్రదమైన జీవితం గడపాలనే మహోన్నత ఆశయంతో నిరంతరం శ్రమించిన మహనీయుడు డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ని కొనియాడారు.

ప్రజాసేవను పరమ ధర్మంగా భావించి, జీవితాంతం ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేసిన మహానేతగా, సంక్షేమ పాలనకు చిరునామాగా, ప్రజల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించిన నాయకుడిగా డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని హాజరైన నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ,జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు యూత్ నాయకులు. మహిళ నాయకురాలు అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## రైతు సదస్సు, రైతు ఆశీర్వాద సభకు భారీగా తరలిరండి

- **మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు**
- **పీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ బాబు**
- **మీడియా సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు పిలుపు**

**బోనకల్,జూలై 8 (డీడీ9 వార్త):**

మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలంలో గురువారం 9వ తేదీన నిర్వహించనున్న రైతు సదస్సు, 10న జరగనున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బోనకల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు, పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ బాబు పిలుపునిచ్చారు. బోనకల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రామ కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రైతు అభివృద్ధి కార్యక్రమాలు, వ్యవసాయ శాఖ ఆధునిక సాంకేతికతలు, సాగులో నూతన విధానాలు, వ్యవసాయ యంత్రాల ప్రదర్శన, రైతులకు అందిస్తున్న ప్రభుత్వ సేవలు తదితర అంశాలను రైతు సదస్సులో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలకు పరిష్కార మార్గాలను వివరించడంతో పాటు, వ్యవసాయ రంగ



అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను రైతులకు ప్రత్యక్షంగా తెలియజేసే వేదికగా ఈ సదస్సు నిలుస్తుందని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతు సదస్సును విజయవంతం చేయాలని, అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, భద్రూనాయక్, నాయకులు ఎర్రంశెట్టి సుబ్బారావు, గూడా నర్సయ్య శాస్త్రి, కందుల పాపారావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకే నినాదం మా అక్క సీతక్క

**తాడ్వాయి మండలం (డిడి9 వార్త)**




ములుగు జిల్లా తాడ్వాయిమండలంలోని ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి, మహిళల సాధికారత, పేద ప్రజల సంక్షేమం, గ్రామీణసమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజల హృదయాల్లో చెరగనిముద్రవేసుకున్న గొప్ప ప్రజానేత సీతక్క అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, పదవితో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచి, సేవే పరమావధిగా జీవిస్తున్న సీతక్క అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం సాధాసీదా జీవనశైలి, నిస్వార్థ సేవాతత్వం, అచంచల ధైర్యసాహసాలు, ప్రజలపట్ల అపారమైన ప్రేమ, అంకితభావం సీతక్క వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనం

దేవుని ఆశీస్సులతో సీతక్క ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో చిరకాలం వర్ధిల్లుతూ, మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో విశిష్ట విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను

**గొంది సరిత**
**కాంగ్రెస్ పార్టీ తాడ్వాయి మండల మహిళా అధ్యక్షురాలు**

## బీఆర్ఎస్‌ది బూటకపు చేరికల డ్రామా: కాంగ్రెస్

- **సొంత కార్యకర్తలకే కండువాలు కప్పి కాంగ్రెస్ నుంచి చేరారంటూ ప్రచారం..**
- **నిజంగా కాంగ్రెస్ నేతలైతే ఒక్క పదవి అయినా చూపించాలని సవాల్..**

**కన్నాయిగూడెం, జూలై 8 (డిడి9 వార్త):**

కన్నాయిగూడెం మండలంలో లక్ష్మీపురం గ్రామంలో బీఆర్ఎస్ నిర్వహించిన చేరికల కార్యక్రమం బూటకమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎండీ అప్సర్ పాషా విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకే గులాబీ కండువాలు కప్పి కాంగ్రెస్ నుంచి భారీ చేరికలు జరిగాయని ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని అన్నారు.

మంగళవారం బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఒక్కరికీ కూడా కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారు నిజంగా కాంగ్రెస్ నాయకులైతే పార్టీ తరఫున నిర్వహించిన కనీసం ఒక్క పదవి అయినా చూపించాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్‌కు కన్నాయిగూడెం మండలంలో ప్రజా మద్దతు లేకపోవడంతో ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడుతోందని ఆరోపించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో లక్ష్మీపురం గ్రామానికి



చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదని, రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కూడా కల్పించలేదని విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాలు, ప్రజాదర్బార్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పింఛన్లు, సన్నబియ్యం వంటి పథకాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వ అభివృద్ధిని చూసి ఓర్వలేకే కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించిన కాంగ్రెస్ నాయకులు, ఇకనైనా బీఆర్ఎస్ అసత్య ప్రచారాలకు స్వస్తి పలకాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఘన నివాళులు

- **ప్రజా సంక్షేమానికి చిరునామాగా నిలిచిన మహానేత వైఎస్సార్**
- **సేవలను స్మరించుకున్న కాంగ్రెస్ నాయకులు**

**ఏటూరునాగారం,జూలై08డీడీ9 వార్త**

మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా 2004-2009 మధ్య అమలు చేసిన సంక్షేమ పథకాలు రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయని పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం, 108 అత్యవసర అంబులెన్స్ సేవలు, 104 గ్రామీణ ఆరోగ్య సేవలు, ఇందిరమ్మ గృహాల పథకం, జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, పేద విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి కోట్లాది మంది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని కొనియాడారు.

ప్రజల మధ్య పాదయాత్ర చేసి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేసిన నాయకుడిగా వైఎస్సార్ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, విద్య, వైద్యం, సాగునీటి రంగాలకు ఆయన అందించిన ప్రాధాన్యత రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది వేసిందని అన్నారు.

సంక్షేమ పాలనకు మారుపేరుగా నిలిచిన వైఎస్సార్ ఆశయాలను కొనసాగించడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని, ప్రజల హృదయాల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న. ములుగు జిల్లా ఆత్మ చైర్మన్ చిట మట రఘు. ఆర్ టి సి డైరెక్టర్ వసంత శ్రీనివాస్. మండల కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య. ఖలీల్. ఏటూరునాగారం టౌన్ అధ్యక్షులు రంజిత్ .సర్వ అక్షిత్. పోల బోయిన .గోపాల్.గంపల శివ కుమార్. గికురూ భాగ్య. రమాదేవి ఉదయ్. మంజుల తదితరులు పాల్గొన్నారు

## టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడిగా మార్తి శ్రీనివాసరావు ఏకగ్రీవ ఎన్నిక...

- **భద్రాచలం అక్షయ్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా సమావేశం..**
- **నూతన జిల్లా కమిటీ ఘనంగా ప్రమాణ స్వీకారం.. జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ...**

**మణుగూరు.జూలై 8 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భద్రాచలం వేదికగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా సమావేశం - జిల్లా ఉపాధ్యక్షుడిగా మార్తి శ్రీనివాసరావు ఏకగ్రీవ ఎన్నిక. భద్రాచలం పట్టణంలోని అక్షయ్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నాడు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశం



లో జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.సమావేశంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఆంధ్రప్రభ పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జి మార్తి శ్రీనివాసరావు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు సంఘం నాయకులు, సభ్యులు శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## టీయూడబ్ల్యూజే జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మొహమ్మద్ ఫారుఖ్

- **జర్నలిస్టుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని ప్రతిజ్ఞ**

కరకగూడెం, జూలై 7(డిడి 9 వార్త)

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కరకగూడెం మండలానికి చెందిన సాక్షి దినపత్రిక రిపోర్టర్ మొహమ్మద్ ఫారుఖ్ ఎన్నికయ్యారు.ఈ మేరకు బుధవారం భద్రాచలంలో నిర్వహించిన జిల్లా సెమినార్‌లో రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో ఆయన నూతన బాధ్యతలను స్వీకరిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా మొహమ్మద్ ఫారుఖ్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం,వారి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తానని,యూనియన్ బలోపేతానికి తన వంతు కృషి అందిస్తానని తెలిపారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.కాగా మొహమ్మద్ ఫారుఖ్‌కు స్థానిక జర్నలిజంలో



సుదీర్ఘ అనుభవం ఉంది.గతంలో పినపాక నియోజకవర్గ ఐజేయూ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సేవలందించారు.అలాగే కరకగూడెం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ,స్థానిక విలేకరుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారు.జిల్లా కమిటీలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అవకాశం దక్కడంపై కరకగూడెం ప్రెస్ క్లబ్ సభ్యులు,తోటి జర్నలిస్టులు,ప్రజాప్రతినిధులు,పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# వార్తల్లో వేగం ఉండాలి.. కానీ వాస్తవాలు మరువద్దు!

- సోషల్ మీడియాకు స్వీయ నియంత్రణే రక్షణ
- ప్రజాస్వామ్యానికి అసత్య ప్రచారం ప్రమాదకరం
- భద్రాచలంలో జర్నలిస్టుల సెమినార్‌లో మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి

**భద్రాచలం, జూలై 8 (డిడి9 వార్త)**

డిజిటల్ యుగంలో సమాచార వేగం పెరిగిన కొద్దీ మీడియా బాధ్యత కూడా అంతకంతకూ పెరుగుతోందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. నిజానిజాలు నిర్ధారించకుండా సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం సమాజానికి తీరని నష్టం కలిగిస్తుందని ఆయన హెచ్చరించారు. భద్రాచలంలోని అక్షయ ఫంక్షన్ హాల్‌లో టీయూడబ్ల్యూజే-ఐజేయూ ఆధ్వర్యంలో 'సామాజిక మాధ్యమాల ప్రభావం - సమాజంపై ప్రభావం' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**అసత్యాలతోనే ప్రమాదం**



ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. "టెలిప్రింటర్, ఫ్యాక్స్ దశల నుంచి నేటి డిజిటల్ విప్లవం వరకు మీడియా రంగం ఎంతో అభివృద్ధి చెందింది. సమాచారం క్షణాల్లో ప్రపంచవ్యాప్తం అవుతోంది. అయితే, వార్తల్లో వేగం ఎంత ముఖ్యమో, వాస్తవికత కూడా అంతే ముఖ్యం. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో సంపాదకీయ నిబంధనలు, వాస్తవ నిర్ధారణా వ్యవస్థలు ఉంటాయి. కానీ, సామాజిక మాధ్యమాల్లో అటువంటి నియంత్రణ లేకపోవడం వల్ల విద్వేషాలు, వ్యక్తిత్వ హననం పెరిగిపోతున్నాయి. దీనికి స్వీయ నియంత్రణే ఏకైక మార్గం" అని



దిశానిర్దేశం చేశారు.

**ప్రజాసేవ జర్నలిజం**

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జర్నలిజం అనేది కేవలం వృత్తి మాత్రమే కాదని, అది సమాజానికి దిశానిర్దేశం చేసే ఒక గొప్ప ప్రజాసేవ అని కొనియాడారు. ప్రజల సమస్యలను పాలకులు దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

**బాధ్యతాయుతమే బలం**

భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. వాస్తవాలను నిర్ధారించకుండా ప్రచారం చేయడం వల్ల సమాజంలో అశాంతి, ఉద్రిక్తతలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రజలకు నమ్మకమైన సమాచారాన్ని అందించడమే మీడియా అసలు లక్ష్యం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామనారాయణ అధ్యక్షత వహించగా, ఐజేయూ సెక్రటరీ జనరల్ సోమసుందర్, రాష్ట్ర నాయకులు మాటేటి వేణుగోపాల్, బి.వి. రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు జాగు వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి జునుమాల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.



# భద్రాచలం డివిజన్ టీయూడబ్ల్యూజే ఐజేయూ అధ్యక్షుడిగా భూక్యా రంజిత్ నాయక్

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రాంనారాయణ చేతుల మీదుగా నూతన కమిటీ బాధ్యతల స్వీకారం
- జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యమని నూతన అధ్యక్షుడి హామీ

**భద్రాచలం, జూలై 8 (డిడి9 వార్త)**

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) భద్రాచలం డివిజన్ (ప్రింట్ మీడియా) అధ్యక్షుడిగా సాక్ష్యం దినపత్రిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి భూక్యా రంజిత్ నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.భద్రాచలం పట్టణ శివారులోని అక్షయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన టీయూడబ్ల్యూజే-ఐజేయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డివిజన్ నూతన కమిటీల ప్రమాణ స్వీకార మహాసభలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రాంనారాయణ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా భూక్యా రంజిత్ నాయక్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి డివిజన్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తిపరమైన విలువల పరిరక్షణ కోసం నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు. డివిజన్ పరిధిలోని పాత్రికేయులను ఐక్యంగా తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సంఘం ఆశయాలకు అనుగుణంగా పాత్రికేయుల గౌరవం, హక్కుల పరిరక్షణకు అంకితభావంతో సేవలందిస్తానని పేర్కొన్నారు. భద్రాచలం డివిజన్ టీయూడబ్ల్యూజే-ఐజేయూ నూతన కమిటీలో అధ్యక్షుడిగా భూక్యా రంజిత్ నాయక్, ఉపాధ్యక్షులుగా బండారి మహేష్ యాదవ్, కాటా సత్యం, పందేలపల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పరుచూరి రవీంద్రబాబు, సహాయ కార్యదర్శులుగా షేక్ ఖాసిం, పసుపులేటి బాబు, కోశాధికారిగా బొల్లె రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా విజయ్, బోళ్ళ వినోద్, సతీష్, వాకచర్ల శ్రీనివాసరావు, అనిల్, వెంకట్, గోసుల వెంకటేశ్వరరావులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు జాగు వెంకటరత్నం, ఐజేయూ జాతీయ సభ్యుడు బీవీ వెంకటరమణారెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా కమిటీ ప్రతినిధులు, డివిజన్ కమిటీ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, పలువురు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఐజేయూ సెక్రటరీ జనరల్ సోమసుందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రాంనారాయణ, జిల్లా అధ్యక్షుడు జాగు వెంకటరత్నం, ఐజేయూ జాతీయ సభ్యుడు బీవీ వెంకటరమణారెడ్డి తదితరులు నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సమిష్టిగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

# వైస్సార్ జయంతి వేడుకలు

- మొక్కలు నాటిన అభిమానులు, వైద్య సిబ్బంది

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో: (డిడి 9 వార్త న్యూస్ )**

దివంగత ముఖ్యమంత్రి, స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వైస్సార్ అభిమాని అల్లం మనోహర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవీన్ రెడ్డి తో కలిసి హాస్పిటల్ ఆవరణలోని గార్డెన్ లో పూల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైస్సార్ ప్రజా రంజక పాలనను, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఉచిత కార్పొరేట్ వైద్యం 'ఆరోగ్యశ్రీ', ఆపదలో ప్రాణాలు కాపాడే '108' అత్యవసర సేవల పథకాలు పేద ప్రజలకు వరంలా మారాయని కొనియాడారు.

అలాగే విద్యా రంగంలో పేద విద్యార్థులను ఉన్నత చదువులకు చేర్చిన 'ఫీజు రీయింబర్స్‌మెంట్', మహిళా సాధికారత కొరకు ప్ర



వేశపెట్టిన 'పావలా వడ్డీకే రుణాలు', మరియు రైతన్నలకు అండగా నిలిచిన 'రైతు రుణమాఫీ' లాంటి చారిత్రాత్మక పథకాలతో వైస్సార్ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన మహానుభావుడని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నవీన్ రెడ్డి, వైస్సార్ అభిమాని అల్లం మనోహర్ లతో పాటు హాస్పిటల్ సిబ్బంది జ్యోతి, కవిత, సౌజన్య, మరియు లక్మన్ తదితరులు పాల్గొన్నారు.



# ఏకగ్రీవంగా గ్రామ పెద్ద (కాపు) ఎన్నిక

- గ్రామ ఐక్యతకు నిదర్శనం
- నూతన గ్రామ పెద్దకు ఘన అభినందనలు

**డిడి 9 వార్త:**

గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామ అభివృద్ధి, ఐక్యతను దృష్టిలో ఉంచుకుని గ్రామ పెద్ద (కాపు) ఎన్నికను గ్రామస్థులు ఏకగ్రీవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువత, మహిళలు పరస్పర చర్చల అనంతరం అందరి సమ్మతితో నూతన గ్రామ పెద్దను చేలకల రామన్న ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు నూతన గ్రామ పెద్దకు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన గ్రామ పెద్ద చేలకల రమన్న మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, గ్రామంలో ఐక్యత, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా పరస్పర సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఏకగ్రీవ ఎన్నిక జరగడం ఆనందదాయకమని పలువురు గ్రామ పెద్దలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆవుల రమేష్ అప్కం స్వామి ఉల్వకాని అశోక్ కుంట బాగువాండ్ల జిన్నం కిష్టయ్య గ్రామస్తులు పాల్గొన్నారు



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అధికార ప్రతినిధి

**ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం (డిడి 9 వార్త)**

తలమడుగు మండలంలోని సాయి లింగి గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు రెబ్బతి అశోక్ అమ్మ కళాబాయ్ ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్న బిఆర్ఎస్ బోత్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్ కుమార్ ఆయన వెంట జరీ పిఏసిఎస్ చైర్మన్ వెల్మ శ్రీనివాస్ రెడ్డి BRS సీనియర్ నాయకులు కాటి పెల్లి శ్రీనివాస్ రెడ్డి నరేష్ కాకర్ల ప్రశాంత్ లచ్చంపూర్ మాజీ సర్పంచ్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబాలను పరామర్శించిన ముత్యాల సునీల్ కుమార్

**నిజామాబాద్ జిల్లా జులై 08(డీడీ9 వార్త):**

కమ్మర్‌పల్లి మండలం నర్సాపూర్ గ్రామంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. గ్రామానికి చెందిన గంగాధర్ కుమార్తె లక్ష్మి, అదేవిధంగా మండలం శేఖర్ తండ్రి రాజన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సునీల్ కుమార్ వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కష్టకాలంలో తమవంతు సహకారం ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పండుగల వేళ అప్రమత్తంగా ఉండాలి

- సీపీ సాయి చైతన్య

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 08(డీడీ9 వార్త):**

రాబోయే పండుగల దృష్ట్యా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని సీపీ పి.సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. బోధన్ డివిజన్ పోలీసు అధికారులతో నిర్వహించిన కీలక సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణే లక్ష్యంగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. పాత నేరస్థులు, రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, సరిహద్దు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్, చీతా ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. డ్రగ్స్, గంజాయి వంటి అక్రమ వ్యాపారాలను అరికట్టేందుకు అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ బాధితులకు సత్వర న్యాయం అందించేలా స్టేషన్ అధికారులు పనితీరు మార్చుకోవాలని సీపీ సూచించారు. ఈ సమావేశంలో ఏసీపీ పి.శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.




# స్థానిక సర్పంచ్ కాంత సునీల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం...

**నిజామాబాద్ పోతంగల్.. కోటగిరి. జులై 8 (డిడి9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని చేతన నగర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ కాంతా సునీల్, ఆధ్వర్యంలో ఆయుర్వేద్య సీనియర్ డాక్టర్ ప్రకాష్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలో నరాల నొప్పులు, నడుము నొప్పి, మోకాళ్ళ నొప్పులు, ఉన్నవారికి వైద్యం చేశారు అదేవిధంగా సమస్యలు ఉన్నవారికి మూడు రోజులకు తగిన మందులు కూడా ఉచితంగా అందించారు. డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినటువంటి స్థానిక గ్రామ సర్పంచ్ కాంత సునీల్ మా యొక్క హాస్పటల్ నుండి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం చాలా మంచి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంత సునీల్, ఉప సర్పంచ్ యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలిగా నలిమెల రేవతి ఏకగ్రీవ ఎన్నిక

**నిజామాబాద్ జిల్లా జులై 08(డీడీ9 వార్త):**

కమ్మర్‌పల్లి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలిగా కొత్తూర్ గ్రామ సర్పంచ్ నలిమెల రేవతి గంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ క్రమంలో ఉపాధ్యక్షుడిగా కె.సి. తండా సర్పంచ్ లకవత్ సంతోష్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా కొనసముందర్ సర్పంచ్ బెజ్జరం రాకేష్, సలహాదారుగా చౌట్పల్లి సర్పంచ్ ఎం.డి. మహబూబ్‌లు బాధ్యతలు చేపట్టారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు రేవతి గంగారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించిన సర్పంచ్‌లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో సర్పంచ్‌లకు ఎదురయ్యే ఎలాంటి సమస్యల పరిష్కారంలోనైనా తాను ముందుండి పోరాడతానని, అందరి సహకారంతో మండల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.







# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలే కీలకం

- సీపీ పి.సాయిచైతన్య

**నిజామాబాద్ జిల్లా జులై 08(డీడీ9 వార్త):**

'మన ఊరుమన భద్రతమన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్, జాకోర గ్రామాల్లో ఏర్పాటు చేసిన 31 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి కాలంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మారుస్తుందని, అందులో భాగంగానే సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, వీటి ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించవచ్చని ఆయన తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ తమ భద్రత కోసం సీసీ కెమెరాలను బాధ్యతగా ఏర్పాటు చేసుకోవాలని, ముఖ్యంగా దుకాణాల యజమానులు తప్పనిసరిగా వీటిని అమర్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామ పంచాయతీలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఎస్సైలు వంశీకృష్ణ, శ్రీనివాస్, మనోజ్, స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ది శ్రీరామ్ అకాడమీతో పాటు పలు అక్రమ నిర్మాణాలపై ఎన్‌జీటీ ఆరా

- ఫిర్యాదులు, జియో-లొకేషన్ ఫోటోలు, ఆధార పత్రాలను పరిశీలిస్తున్న ఎన్‌జీటీ
- నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర నివేదిక కోరినట్లు ప్రచారం
- అక్రమ నిర్మాణాలను ఎందుకు తొలగించలేదని అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం

**హైదరాబాద్,జూలై 08,(డిడి9 వార్త):**




నార్సింగి సర్కిల్ 45 పరిధిలో జి.వో . ఎం.ఎస్. నెం.111 నిబంధనలను ఉల్లంఘిస్తూ జరుగుతున్న అక్రమ నిర్మాణాల వ్యవహారంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) దృష్టి సారించినట్లు సమాచారం.

వార్డ్ నెం.2 పరిధిలోని గౌలిదొడ్డి గ్రామంలో నాలాను ఆక్రమించి నిర్మిస్తున్న ది శ్రీరామ్ అకాడమీ పాఠశాల నిర్మాణాలతో పాటు, జన్వాడ మేకలగడ్డ గ్రామంలో ఫియస్టా ఎదురుగా నిర్మిస్తున్న సుమారు 10 అక్రమ కాటేజీలు, ఫియస్టా దాటిన తర్వాత నిర్మాణంలో ఉన్న భారీ షెడ్, శంకర్‌పల్లి రోడ్డులో రోస్ట్ క్రంచ్ కేఫ్ సమీపంలోని అక్రమ ఢాబా (షెడ్), మోకిల పోలీస్ స్టేషన్‌కు ముందు నిర్మాణంలో ఉన్న భారీ ఫంక్షన్ హాల్, అలాగే కేఫ్ జో సమీపంలో సిల్వర్ వుడ్ వెనుక నాలాను ఆక్రమించి నిర్మిస్తున్న అక్రమ షెడ్లకు సంబంధించి కూడా ఎన్‌జీటీ సంబంధిత అధికారులను వివరణ కోరినట్లు తెలిసింది.


ఫిర్యాదులు, జియోలొకేషన్ ఫోటోలు, ఇతర ఆధారాలు సమర్పించబడిన నేపథ్యంలో ఇప్పటి వరకు ఈ అక్రమ నిర్మాణాలను ఎందుకు తొలగించలేదని, సంబంధిత అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎన్‌జీటీ ప్రశ్నించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని సంబంధిత




శాఖలను ఆదేశించినట్లు తెలిసింది. అలాగే జి.వో.111 పరిధిలోని నాలాలు, చెరువులు, ప్రభుత్వ భూములు,పర్యావరణ పరిరక్షణ ప్రాంతాల్లో





కొనసాగుతున్న అన్ని అక్రమ నిర్మాణాలపై క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉందని సమాచారం. కాగా, ఈ అక్రమ నిర్మాణాలకు సంబంధించిన ఫోటోలు, జియోలొకేషన్ వివరాలు, ప్రజావాణి ద్వారా సమర్పించిన ఫిర్యాదు ప్రతులు, ఇతర ఆధార పత్రాలు ఎన్‌జీటీకి అందినట్లు తెలిసింది. ఈ కేసులో తదుపరి విచారణ అనంతరం కీలక ఆదేశాలు వెలువడే అవకాశం ఉందని సమాచారం.



















# బోధన్ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లను నియమించాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 08(డీడీ9 వార్త):**

బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫాకల్టీ అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ, బహుజన విద్యార్థి ఫోర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులు బోధన్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు వడ్ల సతీష్ చారి, సిరివెసు సంతోష్ మాట్లాడుతూ.. కళాశాలలో ఒకేషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్, జనరల్ ఫౌండేషన్ కోర్స్ మరియు ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సబ్జెక్టులు బోధించడానికి గత రెండు సంవత్సరాలుగా సంబంధిత అధ్యాపకులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రైవేట్ కళాశాలల్లో వృత్తి విద్యా కోర్సులు చదవాలంటే రూ. 18 వేల నుంచి రూ. 20 వేల వరకు ఖర్చవుతుందని, అలాగే ఫీజు రీయింబర్స్మెంట్ సకాలంలో విడుదల కాక మెమోలు, టీసీలు పొందడంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలోని కొన్ని జూనియర్ కళాశాలల్లో 100 మంది విద్యార్థులు కూడా లేకపోయినా అక్కడ అధ్యాపకులు ఉన్నారని, కానీ 345 మంది విద్యార్థులున్న బోధన్ కళాశాలలో అధ్యాపకులు లేకపోవడం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు విమర్శించారు. వచ్చే వారం రోజుల్లోగా గెస్ట్ ఫాకల్టీని నియమించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వడ్ల సతీష్ చారి, సిరివెసు సంతోష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



# బీజేపీ ఎండోమెంట్ సెల్ సలహాదారుగా ఉదయ్ మహారాజ్

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 08(డీడీ9 వార్త):**

బీజేపీ తెలంగాణ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర సలహాదారుగా బోధన్ పట్టణానికి చెందిన ఉదయ్ మహారాజ్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని ఉదయ్ మహారాజ్ పేర్కొన్నారు. ఆయన నియామకంపై బోధన్ ప్రజలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం.. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు

- సోమాజిగూడలో 17 అంతస్తుల భవన నిర్మాణ అనుమతుల రద్దుకు ప్రతిపాదన
- - ప్రాజెక్టు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను నిలిపివేసిన జీహెచ్‌ఎంసీ
- అధికారుల సంయుక్త తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన ఉల్లంఘనలు



**హైదరాబాద్ జులై 08(డిడి9 వార్త):**

హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలపై ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు జీహెచ్‌ఎంసీ (జీహెచ్‌ఎంసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్డులో సదరు సంస్థ నిర్మిస్తున్న 17 అంతస్తుల నివాస సముదాయానికి మంజూరు చేసిన నిర్మాణ అనుమతులను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొంది.

ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ప్రదీప్ రెడ్డి బద్వేలు ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. రెండు సెల్లార్లు, స్టిల్ట్ పార్కింగ్‌తో పాటు 17 అంతస్తులతో కూడిన రెండు టవర్లను ఇక్కడ నిర్మిస్తున్నారు. అయితే, ఈ నిర్మాణంలో కొంత భాగం హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తోందని అధికారులు గుర్తించారు. ఈ నిర్మాణానికి సంబంధించి సాగునీటి పారుదల (ఇరిగేషన్) శాఖ నుంచి ఎటువంటి ముందస్తు అనుమతులు తీసుకోలేదని వెల్లడైంది. ఇరిగేషన్ శాఖ నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం 'హైడ్రా' కమిషనర్ ఏ.వి. రంగనాథ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల సంయుక్తంగా ఈ ప్రాజెక్టును తనిఖీ చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణానికి తాము ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదని ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 450 ప్రకారం నిర్మాణ అనుమతులను రద్దు చేసే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ దరఖాస్తును సైతం జీహెచ్‌ఎంసీ తాత్కాలికంగా నిలిపివేసింది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేని పక్షంలో భవనాన్ని వినియోగించడం చట్టవిరుద్ధం కావడమే కాకుండా, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి కనీస వసతులు లభించవు. తాజా పరిణామాలతో సదరు ప్రాజెక్టులో ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జీహెచ్‌ఎంసీ నోటీసుపై ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ ఇచ్చే వివరణ ఆధారంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

# అల్లు అర్జున్ మూవీని రిజెక్ట్ చేసిన ప్రీతిముకుందన్..



తాజాగా వచ్చిన 'బ్లాస్ట్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్. మానసికంగా, శారీరకంగా దృఢమైన ఆడపిల్లగా ప్రీతి నటించిన తీరుకు విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు తమిళ రొమాంటిక్ డ్రామా 'హృదయం మురళి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఇదిలా ఉంటే.. ఈ యంగ్ హీరోయిన్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో వస్తున్న 'రాకా' సినిమాలో అవకాశం వస్తే రిజెక్ట్ చేసిందట. ఈ విషయాన్ని రాకా డైరెక్టర్ అట్లీ స్వయంగా తెలిపాడు. 'హృదయం మురళి' సినిమా ట్రైలర్ ఈవెంట్‌కు విచ్చేసిన అట్లీ మాట్లాడుతూ.. 'రాకాలో ఒక కీలక పాత్ర కోసం ఫస్ట్ ప్రీతి ముకుందన్‌ను సంప్రదించాము. కానీ అప్పటికే ప్రీతి వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో డేట్లు కుదరక అవకాశం వదులుకోవాల్సి వచ్చింది. అనంతరం ఆ పాత్రను నటి ఫెమినా జార్జ్‌కు ఇచ్చాము. అయితే.. ప్రీతి నటనకు నేను పెద్ద అభిమానిని. 'రాకా'తో కలిసి పని చేసే అవకాశం మిస్ అయినా.. భవిష్యత్తులో తప్పకుండా ఆమెతో ఓ సినిమా చేస్తాను' అంటూ చెప్పుకొచ్చాడు అట్లీ.

## ఆ ఇద్దరు స్టార్స్‌తో పూర్తిస్థాయి ప్రేమకథ చేయాలని ఉంది



కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ 'సప్త సాగరాలు' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు. మొదటి మూవీనే బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో అమ్మడు రేంజ్ ఊహించని విధంగా మారిపోయింది. దీంతో వరుస అవకాశాలు తలుపుతట్టాయి. ఆ తర్వాత మదరాసి, అప్పుడో ఇప్పుడో, ఎప్పుడో వంటి చిత్రాలు పెద్దగా రాణించలేకపోయాయి. కానీ గత ఏడాది వచ్చిన కాంతార చాప్టర్ 1 వంటి చిత్రాల్లో నటించి తన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. అంతేకాకుండా సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం రుక్మిణి వసంత్ స్టార్ హీరోల సినిమాలతో బిజీగా ఉన్నారు. జూనియర్ ఎన్టీఆర్ సరసన 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్న ఆమె, మరోవైపు రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న భారీ పాన్‌ఇండియా చిత్రం 'టాక్సిక్'లో ఒక కీలక పాత్ర పోషించారు. గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించగా, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా ముఖ్య పాత్రల్లో కనిపించబోతున్నారు.

పలు వాయిదాల తర్వాత ఈ ప్రతిష్టాత్మక చిత్రం ఆగస్ట్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోందిఇదిలా ఉంటే, తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రుక్మిణి వసంత్ కోలీవుడ్ స్టార్ హీరో సూర్యపై తనకున్న గాఢమైన అభిమానాన్ని బహిరంగంగా వ్యక్తం చేస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు నటుడు సూర్య అంటే చాలా ఇష్టమని ఆమె చెప్పారు. ముఖ్యంగా 'సూర్య సన్ ఆఫ్ కృష్ణ' వంటి తమిళ క్లాసిక్ సినిమాలో ఆయన పోషించిన మిలిటరీ ఆఫీసర్ పాత్ర తనను ఎంతగానో ఆకట్టుకుందని ప్రశంసించారు. అంతేకాదు, ఆయనకు ప్రపోజ్ చేయాలని ఉందంటూ ఇంటర్వ్యూలో సరదాగా చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో ఖచ్చితంగా సూర్య సార్, ధనుష్ సార్‌లతో కలిసి ఒక పూర్తి స్థాయి ప్రేమకథా చిత్రంలో నటించాలని మనస్ఫూర్తిగా అనుకుంటున్నట్లు రుక్మిణి వసంత్ తన మనసులోని మాటను బయటపెట్టారు.

# 'మా ఇంటి బంగారం' సక్సెస్ తర్వాత బాలీవుడ్‌లోకి నందిని రెడ్డి?



సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' మంచి వసూళ్లు రాబట్టింది. దీంతో దర్శకురాలు నందిని (BV Nandini Reddy)కి బాలీవుడ్ నుంచి అవకాశాలు వస్తున్నాయి. త్వరలో తాను బాలీవుడ్‌లోకి అడుగుపెట్టే అవకాశం ఉందని ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు.

''రెండేళ్లు ఢిల్లీలో చదువుకున్నా. అప్పుడు చాలా హిందీ సినిమాలు చూసేదాన్ని. మంచి కథ కుదిరితే హిందీలో సినిమా చేస్తా. ఏ భాషలో చెప్పినా అది కథే కదా. త్వరలో ఒక డార్క్ సూపర్ నేచురల్ వెబ్‌సిరీస్ తీయబోతున్నా. అక్టోబర్‌లో షూటింగ్ మొదలుపెడతా. లైట్ హార్టెడ్ సినిమాల తర్వాత ఓటీటీలో కాస్త భిన్నంగా ప్రయత్నం చేస్తున్నాను'' అని తెలిపారు. తన తదుపరి ఫిల్మ్ 2027 ప్రారంభంలో ఉంటుందని వెల్లడించారు.

# తమిళ దర్శకుడితో నవీన్ పొలిశెట్టి?

ఈ సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు' చిత్రంతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు హీరో నవీన్ పొలిశెట్టి. ఇది ఆయన కెరీర్‌లో రూ.100కోట్ల వసూళ్లు సాధించిన తొలి సినిమాగా పేరు తెచ్చుకుంది. అయితే ఇప్పుడాయన తదుపరి చిత్రం కోసం ఓ తమిళ దర్శకుడితో చేతులు కలుపుతున్నట్లు తెలిసింది. 'సైరన్' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన ఆంటోని భాగ్యరాజ్‌తో తను కలిసి పని చేయనున్నట్లు సమాచారం. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ చిత్రంపై స్పష్టత వచ్చే అవకాశముంది.





# ఆలయాన్ని వ్యతిరేకించి.. ఇప్పుడు రాజకీయాలా?

అయోధ్య రామాలయ విరాళాల చోరీ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ చేస్తోన్న ఆరోపణలను బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్రంగా ఖండించారు. దశాబ్దాలుగా రామాలయ నిర్మాణాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్, ఇప్పుడు అదే అంశంపై రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని ఆమె మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రదర్శిస్తోన్న ఈ ద్వంద్వ వైఖరిని హిమాచల్ ప్రదేశ్ ప్రజలతో పాటు దేశమంతా గమనిస్తోందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వేందర్ సింగ్ సుఖు అంతకుముందు రోజు మాట్లాడుతూ.. అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేవలం డబ్బు దొంగతనం మాత్రమే కాదని, కోట్ల మంది ప్రజల నమ్మకాన్ని దొంగిలించడమేనని విమర్శించారు. దీనిపై కంగన స్పందిస్తూ.. కోట్ల మంది భారతీయుల శతాబ్దాల పోరాటం, త్యాగాల ఫలితంగానే రామాలయ నిర్మాణం సాధ్యమైందన్నారు. హిమాచల్ లోని కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఆలయ నిధులను ప్రభుత్వ పథకాలకు మళ్లించడానికి, మతపరమైన సంస్థలపై నియంత్రణ సాధించడానికి ప్రయత్నించిందని, అలాంటిది ఇప్పడు రామాలయం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఆరోపించారు. బీజేపీ ఎన్నడూ విశ్వాసాన్ని ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకోలేదని, సనాతన సంస్కృతి రక్షణకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి పవిత్రమైన అంశాలను రాజకీయం చేస్తోందని విమర్శించారు. మరోవైపు, హిమాచల్ కాంగ్రెస్ నేత, మంత్రి విక్రమాదిత్య సింగ్ మాట్లాడుతూ.. ఇదే విరాళాల చోరీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగి ఉంటే, బీజేపీ దేశవ్యాప్తంగా అల్లకల్లోలం సృష్టించి ఉండేదన్నారు.

### ఎనిమిది మంది అరెస్ట్.. ట్రస్ట్ సభ్యుల రాజీనామా

రామాలయ నగదు కానుకల దుర్వినియోగం కేసులో ఉత్తరప్రదేశ్ సిట్ (SIT) ఇప్పటికే ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసింది. ఈ వివాదం నేపథ్యంలో శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేయగా, ట్రస్ట్ వాటిని ఆమోదించింది. వారి స్థానంలో కృష్ణ మోహన్‌ను తాత్కాలిక జనరల్ సెక్రటరీగా నియమించారు.


# ఏం మాట్లాడాలన్నా భయంగా ఉంది..

అక్కినేని నాగార్జున తనయుడు అఖిల్ ప్రధాన పాత్రలో నటించిన 'లెనిన్' సినిమా జూలై 10న థియేటర్స్‌లోకి రాబోతున్న విషయం తెలిసిందే. ఇందులో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. అయితే ఈ సినిమాను మురళి కిషోర్ అబ్బూరి తెరకెక్కించారు. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్స్‌పై నాగవంశీ, అక్కినేని నాగార్జున నిర్మిస్తున్నారు. అయితే ఈ మూవీ విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో.. చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. అయితే ఈ వేడుకల్లో పాల్గొన్న నాగార్జున షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అక్కడ ఉన్న మీడియా మిత్రులందరినీ చూస్తుంటే తనకు తన కెరీర్ ప్రారంభ రోజులు గుర్తొస్తున్నాయని నాగార్జున ఎమోషనల్ అయ్యారు. ఒకప్పుడు సినిమా ప్రమోషన్స్ లేదా ప్రెస్ మీట్స్ అంటే కేవలం ఒక ఆరుగురు జర్నలిస్టులు, ఒకే ఒక్క ఫోటోగ్రాఫర్ మాత్రమే ఉండేవారని ఆయన గుర్తు చేసుకున్నారు.

అప్పట్లో ఇప్పటిలాగా చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు, నిరంతరం రికార్డ్ చేసే కెమెరాలు, డిజిటల్ రికార్డింగ్స్ వంటివి ఏమీ ఉండేవి కావని చెప్పారు. రేపు సినిమా రిలీజ్ అవుతుంది అనగా కేవలం ఆ ఆరుగురు వ్యక్తులు మాత్రమే వచ్చి కూర్చునేవాళ్లని, వాళ్లే ఎంతో స్నేహపూర్వకంగా ప్రశ్నలు అడిగేవారని నాగార్జున పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పైగా ఆ రోజుల్లో మీడియా ముందు మాట్లాడటానికి ఎలాంటి భయం కూడా ఉండేది కాదని ఆయన స్పష్టం చేశారు. కానీ, ఇప్పటి పరిస్థితి పూర్తిగా మారిపోయిందని నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మీడియా ముందు నిలబడి మాట్లాడాలంటేనే మనసులో ఒక రకమైన భయం వేస్తోందని ఆయన చెప్పారు. ఎక్కడ ఏ కెమెరా పెడతారో, ఎవరు ఎలాంటి ప్రశ్న అడుగుతారో, దాన్ని ఎలా ప్రొజెక్ట్ చేస్తారో తెలియని గందరగోళం ఉంటోందని అన్నారు. ఈ విపరీతమైన కెమెరాల నిఘా, ఒత్తిడి వల్లే ప్రస్తుతం సెలబ్రిటీలందరూ మీడియా ముందు అంత ఫ్రీగా ఉండలేకపోతున్నారని, ఎక్కడికక్కడ ఫ్రీజ్ అయిపోయి కనిపిస్తున్నారని నాగార్జున వివరించారు.



# డాగ్ వల్ల షూటింగ్ ఆలస్యమైంది..



టాలీవుడ్ హీరో అక్కినేని అఖిల్ నటించిన తాజా చిత్రం 'లెనిన్' జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో అఖిల్ వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ చిత్రాన్ని జోరుగా ప్రమోట్ చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో, 'లెనిన్' చిత్రంలో మీతో పాటు ఓ కుక్క కూడా కీలక పాత్రలో కనిపిస్తుందని, దాని వల్ల షూటింగ్‌కు అంతరాయం ఏర్పడిందని వినిపిస్తోంది. అది నిజమేనా? అని ప్రశ్నించగా అఖిల్ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. అఖిల్ మాట్లాడుతూ.. "మా సినిమాలో ఒక కుక్కకు చాలా కీలకమైన పాత్ర ఉంది. సినిమా మొత్తం అది నాతోనే ప్రయాణిస్తుంది.

చివరకు యాక్షన్ సన్నివేశాల్లో కూడా నాతో పాటు కనిపిస్తుంది. షూటింగ్‌కు అది ఒక్కరోజు మాత్రమే కాస్త ఇబ్బంది కలిగించింది. మొదటి రోజు షాట్ తీస్తుండగా 'యాక్షన్' అనగానే అది పరుగెత్తి వెళ్లిపోయింది. దాంతో కొంతసేపు షూటింగ్ నిలిచిపోయింది. అయితే ఆ తర్వాత మాత్రం ఎలాంటి ఇబ్బంది కలిగించలేదు. చాలా ప్రశాంతంగా షూటింగ్ పూర్తైంది. సినిమాలో ఆ కుక్క నటనకు ప్రేక్షకులు తప్పకుండా ఫిదా అవుతారు" అని చెప్పుకొచ్చాడు. ఇక ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించగా, మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించాడు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.